ఒంటిమిట్టలోని ఏటీఎంలో సీసీ కెమెరాకు స్ప్రే కొడుతున్న దుండగుడు



ఏటీఎంలను కొల్లగొట్టారు..



కడపలోని ఏటీఎంలో సీసీ కెమెరాకు స్ప్రే కొడుతున్న దుండగుడు

కడప జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున రెండు ఏటీఎంలలో భారీ చోరీ జరిగింది. మాస్కులు ధరించిన దుండగులు ఏటీఎంలలోకి ప్రవేశించి సీసీ కెమెరాలకు స్ప్రే కొట్టి అనంతరం కట్టర్లతో మిషన్లను పగులగొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. తొలుత కడప నగరంలో, అనంతరం ఒంటిమిట్టలో చోరీలకు పాల్పడ్డారు. రెండు చోట్ల మొత్తం 42,38,700 రూపాయలను దుండగులు దోచుకెళ్లారు. దొంగతనం చేసిన అనంతరం కారులో రాజంపేట వైపు పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒంటిమిట్టలోని ఏటీఎం మిషన్‌ను కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలోనే ఘటన జరగడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



కడపలో నగదు దోచుకెళ్లిన ఏటీఎం మిషన్

- రెండు ఏటీఎంలలో భారీ చోరీ
- రూ.42,38,700 అపహరణ
- అంతర్రాష్ట్ర ముఠాగా పోలీసులు అనుమానం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఒంటిమిట్టలోని ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగుడు

ఒంటిమిట్ట/కడప క్రైం, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని కడప-చెన్నై జాతీయ రహదారి స్థానిక పోలీసుస్టేషన్‌కు 30 అడుగుల దూరంలో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి అందులోని నగదును దోచుకెళ్లారు. ముఖానికి మంకీ క్యాపు పెట్టుకుని ఏటీఎంలోకి ప్రవేశించిన దుండగుడు కెమెరాలకు నలుపురంగును స్ప్రే చేసి దొంగతనానికి పాల్పడ్డాడు. దొంగతనానికి పాల్పడిన ముఠా ముందుగా రెక్కీ నిర్వహించి ఏటీఎం ముందుభాగంలో కారును ఆపి అందులోని ఒక వ్యక్తి ఏటీఎంలోకి ప్రవేశించి మరో వ్యక్తి బయట కాపలాగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఏటీఎంలో డబ్బులు దోచుకెళ్లిన అనంతరం రాజంపేట వైపు వేగంగా కారులో వెళ్లినట్లు కెమెరాల్లో పోలీసులు గుర్తించారు. ఏటీఎంలో 4.10 గంటలకు దొంగతనానికి పాల్పడితే 5 గంటల వరకు కనీసం పోలీసులకు సమాచారం రాకపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోలేకపోయారు. ఏటీఎంలో చోరీ జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే ఘటనా స్థలానికి సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివప్రసాద్‌లు పరిశీలించి స్థానికంగా ఉన్న హైవే కెమెరాలను పరిశీలించారు. అనంతరం కడప నుంచి వచ్చిన క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగిన విషయాన్ని బ్యాంకు సిబ్బందికి తెలపడంతో వెంటనే మేనేజర్ జగదీష్‌కుమార్ సిబ్బందితో ఏటీఎం వద్దకు చేరుకుని పోలీసులకు వివరాలు తెలియజేశారు. అనంతరం రాజంపేట ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మురళీనాయక్, చీఫ్ మేనేజర్ మల్లికార్జునరావు ఏటీఎంను పరిశీలించారు.

ఏటీఎంలో రూ.39 లక్షలు నగదు పెట్టిన సిబ్బంది

స్థానికంగా ఉన్న ఏటీఎంలో ఆదివారం సెలవు కావడంతో ఎస్‌బీఐ సిబ్బంది శనివారం సాయంత్రం 39 లక్షల రూపాయల నగదును ఏటీఎంలో భద్రపరిచారు. వారు పెట్టిన సమయం నుంచి రూ.2.80 లక్షలు నగదు విత్‌డ్రా చేయడంతో మిగిలిన 36,19,400 రూపాయలు దోచుకెళ్లినట్లు ఎస్‌బీఐ మేనేజర్ జగదీశ్‌బాబు తెలిపారు.

పోలీసు అధికారులపై తీవ్ర విమర్శలు

స్థానిక పోలీసుస్టేషన్‌కు 50 అడుగుల దూరంలో ఉన్న ఏటీఎంలో చోరీ జరగడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు తమ పోలీసుస్టేషన్ పక్కనున్న వాటికే రక్షణ కల్పించలేని పరిస్థితిలో ఉండడం పోలీసులపై తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. మూడు నెలలుగా ఒంటమిట్ట బస్టాండుల్లో వరుస దుకాణాల్లో చోరీ జరగడం, వెంటనే ఏటీఎంలో చోరీ జరగడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.



ఒంటిమిట్టలోని ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పోలీసుస్టేషన్ పక్కనే ఉన్నా ఏమి చేస్తున్నారు

స్థానిక పోలీసుస్టేషన్ పక్కనే ఏటీఎం ఉండడం, చోరీ జరగడం చూస్తుంటే ఏ మేరకు విధులు నిర్వహిస్తున్నారో అర్థమవుతుందని సీఐ కృష్ణంరాజునాయక్‌పై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఏ మేరకు సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఏటీఎం చోరీ జరిగిన ప్రాంతాన్ని ఎస్పీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పరిశీలించి స్థానిక పోలీసు అధికారులు, బ్యాంకు సిబ్బంది ద్వారా సమాచారాన్ని సేకరించారు. దుండగుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

దుండగుల కోసం సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగిన వెంటనే స్థానిక పోలీసు అధికారులు, జిల్లా అధికారుల సమన్వయంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగలను పట్టుకునేందుకు విచారణ చేపట్టారు. హర్యానా రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. కడప, ఒంటిమిట్ట రెండు ఏటీఎంల్లో ఒక్కరే చోరీకి పాల్పడడం, కడపలో ఎరుపు రంగు దుస్తులతో ఏటీఎంలోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడడం, అదే వ్యక్తి ఒంటిమిట్ట ఏటీఎంలోకి మంకీ క్యాప్ ద్వారా ఏటీఎంలకు చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కడపలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి వేసుకున్న బూట్లు, ఒంటిమిట్టలో చోరీకి పాల్పడిన వ్యక్తి బూట్లు ఒకేవిధంగా ఉండడంతో ఒకేవ్యక్తి రెండు ఏటీఎంల్లో చోరీకి పాల్పడినట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.

కడపలో రూ.6.19 లక్షల నగదు అపహరణ

- మరోచోట ఏటీఎం చోరీ యత్నం
- అలారం మోగడంతో పరారైన దొంగలు

కడప (క్రైం), సెప్టెంబరు 22 : కడప నగరంలో రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించి ఓ చోట ఏటీఎం మిషన్‌ను పగులగొట్టి రూ.6,19,300 నగదు దోపిడీ చేశారు. శనివారం అర్ధరాత్రి 12.40 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని కారులో దుండగులు కడప నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్దకు వచ్చారు. అక్కడున్న ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లోకి ప్రవేశించి చోరీకి యత్నించారు. ముందుగా ఏటీఎం మిషన్ రూంలోని సీసీ కెమెరాలకు స్ప్రే కొట్టడంతో పాటు మాస్కులు ధరించి యువకులు చోరీ యత్నానికి ప్రయత్నించారు. లోపల రూములోని డోరు ఓపెన్ చేసే ప్రయత్నం చేయగా అలారం మోగింది, దీంతో అక్కడ నుంచి పరారయ్యారు. తరువాత అక్కడ నుంచి ద్వారకానగర్‌లోని రైతు బజారు సమీపంలో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌కు చేరుకున్న దుండగులు తెల్లవారుజామున 2-3 గంటల వరకు ఏటీఎంలోకి ప్రవేశించిన దుండగులు కట్టర్ల సహాయంతో మిషన్‌ను కట్ చేసి అందులో ఉంచిన రూ.6,19,300 నగదును అపహరించుకుని వెళ్లారు. చోరీలు జరిగిన ఏటీఎం మిషన్ల వద్దకు కడప వన్‌టౌన్ సీఐ బి.రామక్రిష్ణ, సీసీఎస్ సీఐ హేమకుమార్‌లు తమ సిబ్బందితో చేరుకున్నారు. సంఘటనలపై పోలీసులు తమ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దుండగుల కోసం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో పోలీసు అధికారుల బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

కడప జడ్పీ సీఈవోగా ఓబులమ్మ

పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు

కలికిరి, సెప్టెంబరు 22: పంచాయతీరాజ్‌కు సంబంధించి జడ్పీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పలు కేడర్లలో బదిలీల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. కడప జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవోగా ఉన్న డిప్యూటీ సీఈవో ఎం.సుధాకర్‌రెడ్డిని పుట్టపర్తి డీఎల్‌డీవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో అనంతపురం డీఎల్‌డీవో సి.ఓబులమ్మను కడప జడ్పీ సీఈవోగా నియమించారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న డీఎల్‌డీవో జె.శ్రీనివాసులును బద్వేలు డీఎల్‌డీవోగా నియమించారు. కడప డీపీవోగా పనిచేస్తున్న డీఎల్‌డీవో డి.ప్రభాకర్‌రెడ్డిని ఆదోని డీఎల్‌డీవోగా బదిలీ చేశారు. మదనపల్లె డీఎల్‌డీవో వి.లక్ష్మీపతిని రాయచోటి డీఎల్‌డీవోగా బదిలీ చేశారు. చిత్తూరు డీఎల్‌డీవో జి.రవికుమార్‌ను పులివెందుల డీఎల్‌డీవోగా నియమించారు. కర్నూలు డీఎల్‌డీవోగా పనిచేస్తున్న పి.బాలకృష్ణారెడ్డిని అన్నమయ్య జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా నియమించారు. విజయవాడ నుంచి డీపీవో జి.రాజ్యలక్ష్మిని బదిలీ చేసి కడప జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు. అక్కడున్న డి.ప్రభాకర్‌రెడ్డిని ఆదోనికి బదిలీ చేశారు. మైదుకూరు ఏపీడీగా పనిచేస్తున్న కె.జుబేదాను చిత్తూరు జడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. కడప డ్వామా కార్యాలయం ఏవోగా పనిచేస్తున్న పి.మైథిలిని కడప జడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు.

మైన్స్ అండ్ జియాలజీలో బదిలీలు : మైన్స్ అండ్ జియాలజీ శాఖలో పలువురు డివిజనల్ ఎంజీవోలను బదిలీ చేశారు. మదనపల్లె డీఎంజీవో డి.రవిప్రసాద్‌ను భీమవరం బదిలీ చేశారు. అమలాపురంలో ఉన్న డీఎంజీవో ఎం.సుబ్రమణ్యంను కడపకు బదిలీ చేశారు. దాచేపల్లె డీఎంజీవోగా పనిచేస్తున్న దేవాదుల వెంకట రంగకుమార్‌ను మదనపల్లె డీఎంజీవో బదిలీ చేశారు. రాయచోటి డీఎంజీవో ఆర్.రాజేష్‌కుమార్‌ను బాపట్లకు బదిలీ చేశారు. ఈ మేరకు మైన్స్ అండ్ జియోలాజీ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- దీపావళి నుంచి మూడు సిలిండర్ల పథకం అమలు
- మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, సెప్టెంబరు 22: పేదల సంక్షేమమే కర్తవ్యంగా పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందచేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు రాయచోటి మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పూల వర్షంతో, బాణాసంచాలతో ఘనస్వాగతం పలికారు. ఆయన శిబ్యాల గ్రామ కస్పాలోని గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజా దర్బార్‌లో మంత్రి మాట్లాడుతూ గతంలో ఎవరూ చేయని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల నుంచి ఇది మంచి ప్రభుత్వం అని ఒక గుర్తింపు పొందిందన్నారు. దీపావళికి అర్హులైన ప్రతి ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి త్వరలో విధి విధానాలు రూపొందించి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. పేద ప్రజలు ఎవరూ ఆకలితో పస్తులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన నూతన జిల్లాల్లో ప్రతి శాఖకు ప్రభుత్వ భవనాలు నిర్మిస్తామని తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్య రాకుండా రాబోయే ఐదు సంవత్సరాల్లో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. అలాగే ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు వరకు ఎన్టీఆర్ కాలనీలు నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వంలో భూఆక్రమణలు జరిగాయని, అవన్నీ తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామన్నారు. రాయచోటి ప్రాంత వాసులు చాలా మంది జీవనాధారం కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి అక్కడ నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి వారి సమస్యలన్నీ పరిష్కరించేందుకు మన ప్రాంతంలో వివిధ ఫ్యాక్టరీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, రాయచోటి మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, గ్రామ సర్పంచ్ నాగమణి, మాజీ సర్పంచ్‌లు కొండా విజయభాస్కర్‌రెడ్డి, బసయ్య, జిలానీబాషా, టీడీపీ నేతలు నారాయణరెడ్డి, గంగిరెడ్డి, శివారెడ్డి, జాకీర్, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి గుణశేఖర్‌పిళ్లై, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీవో మల్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వంద రోజుల కేక్ కట్ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మదనపల్లె యువకుడికి పురస్కారం

శాస్త్రవేత్తగా స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీ అవార్డు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22: మదనపల్లెకు చెందిన యువ శాస్త్రవేత్త భరత్ శ్రీనివాస్‌కు అమెరికాలోని స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీ గొప్ప పురస్కారం అందజేసింది. 2024 ఏడాదికి గాను ప్రకటించిన శాస్త్రవేత్తల్లో భరత్ శ్రీనివాస్ 2వ స్థానం పొందారు. మదనపల్లె పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటరమణ, రమాదేవి దంపతుల కుమారుడు డాక్టర్ వి.భరత్ శ్రీనివాస్ బీటెక్ పూర్తి చేసి ఎన్ఐటీలో పీహెచ్‌డీ చేశారు. అలాగే ఐఐటీలో పోస్ట్‌డాక్ పూర్తి చేసిన ఆయన బెంగళూరులోని మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్కోపస్ డాటాబేస్ అంశంలో ఎక్కువ జర్నల్స్ రాసి ప్రచురించారు. దీని ఆధారంగా తీసుకున్న స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీ శ్రీనివాస్‌ను పురస్కారానికి ఎంపిక చేసింది. ఇందులో భాగంగా ఈనెల 16వ తేదీ వరంగల్ ఎన్ఐటీ వద్ద డైరెక్టర్ ఎన్వీ రమణరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వి.భరత్ శ్రీనివాసులు

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



ధర్మపథంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 22: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆదివారం వైభవంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయంలోని కల్యాణమండపంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరు నారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని పూలు, ఆభరణాలతో అలంకరించి కల్యాణ వేదికపై ముస్తాబు చేసి కంకణధారణ, యజ్ఞోపవితం, భాషికధారణ, బెల్లం, జీలకర్ర సమర్పణ, మాంగల్య సూత్రాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. హోమాది కార్యక్రమాన్ని నిర్వహించి శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు నడుమ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి కల్యాణానికి సంబంధించిన విషయాలు, ఆధ్యాత్మిక పెంపొందించుకునే అంశాలను శ్రీనివాసాచార్యులు వివరించారు. ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి, కార్యసిద్ధి అభయాంజనేయస్వామి, సిద్ధి గణపతి, ధ్యాన షిరిడీ సాయిబాబా, శనేశ్వరస్వామి, లింగోద్భవ మహాశివుడిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులు ప్రణవ ధ్వజస్తంభ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వసంతమ్మ, కోమల, శశికళ, రాధమ్మ, అరుణ, వెంకటేష్, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

చెరువును చెరబట్టారు

- 40 ఎకరాలు మాయం
- వైసీపీ ఖద్దరు బాబుల చేతుల్లో ఎస్.కొత్తపల్లి చెరువు
- కూటమి ప్రభుత్వంలోనైనా చర్యలు తీసుకునేనా..?

వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు పేట్రేగిపోయి వంకలు, వాగులు, చెరువులు దేనినీ వదలకుండా కబ్జా చేసేశారు. ప్రభుత్వం మాదే మమ్మల్ని ఎవరు అడిగేది అని పేట్రేగిపోయారు. చెరువులను కబ్జా చేసి దర్జాగా తోటలు సాగు చేస్తున్నారు. ఇవన్నీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని ఎస్.కొత్తపల్లె చెరువును కబ్జా చేసి అరటి తోట సాగు చేస్తున్నారు.

రైల్వేకోడూరు(రూరల్), సెప్టెంబరు 22: వైసీపీ ప్రభుత్వ హయాంలో భూబకాసురులు వంకలు, వాగులు, చెరువులు, ప్రభుత్వ భూములు దేనీని వదలకుండా కబ్జా చేసేశారు. ఐదేళ్ల పాలనలో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగింది. అధికారులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో చెరువులను కబ్జా చేసే ఏకంగా అందులో తోటలు వేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నారు. మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు దేన్నీ వదలకుండా ఇష్టానుసారంగా కబ్జాకు పాల్పడ్డారు.


ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ అడ్డు వచ్చిన అధికారులను బెదిరిస్తూ యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడ్డారు. స్థానికంగా ఉండే ప్రజలు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా నామమాత్రంగా తనిఖీలు నిర్వహించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కబ్జారాయుళ్ల ఆటలు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగాయి. మండలంలోని ఎస్.కొత్తపల్లి పంచాయతీలోని సర్వే నెంబరు-13లో శ్రీనివాసపురం కొత్తపల్లి చెరువు 57.25 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువుకు అటు ఇటు వ్యవసాయ భూములు సుమారు కొన్ని వం దల ఎకరాలు ఉన్నాయి. వర్షాలు భారీగా కురిస్తే దగ్గరలో ఉన్న శెట్టిగుంట చెరువు నుంచి ఎస్.కొత్తపల్లి చెరువుకు నీళ్లు వస్తాయి. దీంతో చెరువు పూర్తిగా నిండి సమీపంలో ఉన్న పొలాలు దెబ్బతినే పరిస్థితి ఉండేది. గతం లో ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో సమస్యను గుర్తించిన నాయకులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువు కబ్జాకు గురికాకుండా పూర్తిగా మరమ్మతులు నిర్వహించి చెరువు చుట్టూ ఆనకట్టలను నిర్మించారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూబకాసురుల కన్ను చెరువుపై పడింది.

యథేచ్ఛగా చెరువును ఆక్రమించుకుని అరటి, మామిడి చెట్లను సాగు చేసుకుంటూ చెరువునే మింగేశారు. స్థానిక ప్రజ లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. వైసీపీ ఖద్దరు చేతుల్లో సుమారు 40 ఎకరాల చెరువు కబ్జాకు గురైంది. చెరువును కబ్జా చేసిన ఖద్దరుబాబులు ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వానికి జైకొడుతూ దర్జాగా వ్యవసాయం చేసుకుంటున్నారు. కూట మి ప్రభుత్వంలో అయినా చెరువుకు మోక్షం కలిగేలా కూటమి నాయకులు ఈ చెరువుపై దృష్టి సారించి కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

చెరువును కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును పరిశీలిస్తాం. చెరువును కబ్జా చేసిన తోటలను తొలగిస్తాం. ఇరిగేషన్ అధికారుల సహకారంతో చెరువును రీసర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేస్తాం. చెరువును కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

\- రెడ్డిప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్



ఎస్.కొత్తపల్లి చెరువు



చెరువు కట్ట ఆనుకుని వేసిన అరటి తోట

ప్రొఫెసర్ నరసింహారెడ్డి కన్నుమూత

పరిశోధనార్థం రిమ్స్‌కు దేహదానం



ప్రొఫెసర్ పూడూరి నరసింహారెడ్డి దేహాన్ని అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు సెప్టెంబరు 22: విశ్రాంత అగ్రికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ పూడూరి నరసింహారెడ్డి (86) ఆదివారం కన్నుమూశారు. ఆయన కోరిక మేరకు శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం కడప రిమ్స్‌కు కుటుంబ సభ్యులు అప్పగించారు. వివరాల్లోకెళితే...

రాజుపాళెం మండలం వెంగళాయపల్లె వాసి పూడూరి నరసింహారెడ్డి తిరుపతి అగ్రికల్చర్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తగా కూడా ఆయన సేవలందించారు. వేరు శనగలో వేమన అనే వంగడాన్ని అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తల బృందానికి నాయకత్వం వహించారు. ఉద్యోగ విరమణానంతరం ప్రొద్దుటూరులోని హౌసింగ్ బోర్డులో స్థిరపడ్డారు. ఆయన ఆదివారం తెల్లవారు ఝామున కన్నుమూశారు. మరణానంతరం తన శరీరాన్ని పరిశోధనార్థం అప్పగించాలని కోరికపై ఆయన తమ్ముని కుమార్తె విప్లవ రచయితల సంఘం మాజీ కార్యదర్శి పూడూరి వరలక్ష్మీ, ఆయన భార్య లీలావతి అనుమతితో రిమ్స్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఆయన తమ్ముడు పూడూరు నరసింహారెడ్డి దేహం కూడా రెండేళ్ల కిందట కడప రిమ్స్‌కు అప్పగించడం విశేషం. జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దేహదానం చేయడం అరుదైన విషయమన్నారు. డాక్టర్ ఓబులరెడ్డి, డాక్టర్ మల్లెల భాస్కర్, పల్లవోలు రమణ, సృజన శ్రీనివాసులరెడ్డి, నాగార్జున రెడ్డి, ఏఐఎస్ఎఫ్ వలరాజు, ప్రతాప్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివరాం, అనాటమి డిపార్ట్ మెంట్ హెడ్ డాక్టర్ శారద పాల్గొన్నారు.

ఉర్దూ సమస్యల పరిష్కారానికి కృషి

- రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్



సమావేశంలో మాట్లాడుతున్న రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు22: ప్రభుత్వ సహకారంతో ఉర్దూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ (రూటా)రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రూటా జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిబాతుర్ రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 1997లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఉర్దూ విద్యా వ్యవస్థకు ఊపిరి పోశారన్నారు. 2024లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలోని ప్రతి ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. 2001లో చంద్రబాబు రోష్ని పథకం ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించి ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు రెండు సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులు మంజూరు చేసి ఉర్దూ పాఠశాలల మనుగడకు పునాది వేశారని చెప్పారు. రోష్ని పథకం పునఃప్రారంభించి ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లాబాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు స్థాపించాలని, మైనార్టీ పసిపిల్లలకు మాతృభాషలో చదివే భాగ్యం కల్పించి ఉర్దూ నిరుద్యోగ యువతకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు హుమయుద్దీన్, ఇంరోజ్అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో మంచి ప్రభుత్వంగా గుర్తింపు

● నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు



గ్రామ సభలో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 22: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇది మంచి ప్రభుత్వంగా ప్రజలు గుర్తింపునిచ్చారని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. ఆదివారం తొండూరు మండలం మల్లేల గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం సభలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి వంద రోజుల్లో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. బీటెక్ రవి మాట్లాడుతూ పింఛన్‌ను పెంచుతామని చెప్పిన రోజు నుంచే ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అన్నక్యాంటీన్‌ను పునఃప్రారంభించారన్నారు. రైతులకు నిద్రలేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. గత ప్రభు త్వంలో అసైన్‌మెంట్‌లో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగలేదన్నారు. అర్హులకు భూములు కేటాయించలేదని తెలిసి పాస్‌బుక్కులను దగ్గరే ఉంచుకుని ఎలక్షన్ అయిపోయిన తర్వాత పంపిణీ చేశారన్నారు. తిరుమల లడ్డూను కల్తీ చేసిన హీనమైన చరిత్ర జగన్ ప్రభుత్వానిదని, అందుకే 11సీట్లకే పరిమితం అయ్యారన్నారు. వైసీపీ నేతలు చేసిన అరాచకాలను ప్రజలందరు గుర్తించారన్నారు. అనంతరం ప్రజలు బీటెక్ రవికి తమ సమస్యలను చెప్పి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శివమోహన్‌రెడ్డి, నాగిరెడ్డి, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మురళి, ఎస్ఐ పెద్ద ఓబన్న, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు

అరెస్టు అయిన వారిలో వైసీపీ కార్పొరేటర్

కడప క్రైం సెప్టెంబరు 22: కడప నగరం సాయిపేటలో ఇటీవల జరిగిన దాడి కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సిఐ నాగర్జున తెలిపారు. సిఐ వివరాల మేరకు సాయిపేటకు చెందిన అస్లాం, అదే ప్రాంతానికి చెందిన యునోస్ లు బంధువులు గత కొంత కాలంగా కుటుంబ మనస్పార్ధలు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 20 వతేదిన అస్లాం, కార్పోరేటర్ రఫీ, మరికొందరుతో కలిసి యునోస్, మరోమహిళను కర్రలతోదాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. భాదితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసులో ఆదివారం అస్లాం, జావేద్, కార్పోరేటర్ రఫీ, ముక్తియార్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, ఇవన్నీ ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం మదనపల్లె రోడ్డులో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా అధ్యక్షుడిగా గాజుల భాస్కర్ ప్రమాణంలో ఆయన మాట్లాడుతూ మతతత్వ బీజేపీ దేశంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రధాని ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తూ దేశాన్ని ఇతరులకు తాకట్టు పెడుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నేత నల్లకదిరిగాళ్ల శాంతయ్య, రాష్ట్ర మైనార్టీ వైస్ ఛైర్మెన్ మహమ్మద్‌రఫీ, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్నక్రిష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు దర్బార్ బాషా, పట్టణ మాజీ అధ్యక్షుడు ఫరూఖ్‌ఖాన్, కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు, రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గోశాల దేవి పాల్గొన్నారు.

తల్లి మరణం తట్టుకోలేక కుమార్తె మృతి



పోరుమామిళ్ల, సెప్టెంబరు 22: తల్లి మృతిని జీర్ణించుకోలేక కుమార్తె మేరమ్మ(45) మృతి చెందింది. రంగసముద్రం పం చాయతీ గిరినగర్‌కాలనీ వాసి కందుల నీలమ్మ నాలుగు రోజు ల కిందట మృతి చెందింది. ఆమె మరణాన్ని జీర్ణించు కోలేని ఆమె కుమార్తె మేరమ్మ ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. కుటుంబీకులు శోక సంద్రంలో మునిగారు.



తమలపాకు రైతు విలవిల

● నోరు పండించే ఆకు - రైతు బతుకు పండించలేదు ? ● బుట్ట ధర వంద - కూలి రెండు వందలు



రైతులు సాగుచేసిన తమలపాకు తోట

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 22: శుభ, అశుభ కార్యాల్లో అగ్రస్థానం తమలపాకులదే. తెలుగు సంప్రదాయంలో తమలపాకులకు ఒక ప్రత్యేక స్థానం. ప్రాచీన కాలం నుంచీ కుల మతాలకతీతంగా తమలపాకు వినియోగం ఉంది. వివాహాల అనంతరం విందు భోజనాల చివరలో కచ్చితంగా నోరు పండాల్సిందే. తమలపాకు, వక్క, సున్నం వేసుకుని నమలడం వల్ల తిన్న ఆహారం సక్రమంగా జీర్ణమవుతుందని పెద్దల మాట. స్వీట్ బీడాల్లో సుగంధ ద్రవ్యాలు రంగరించి ఆకు చుట్టి ఇవ్వడంతో దానికి ఒక కొత్తరూపు అవతరిస్తుంది. తిరుపతి హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు వంటి నగరాల్లో పాన్ సెంటర్లు దర్శనమిస్తూ ఉంటాయి. పాన్‌బీడా విలువ రూ. 20 మొదలు రూ. 50 వరకు ఉంటుంది.

తమలపాకును ఉమ్మడి కడప జిల్లాలో చెన్నూరు, ఊటుకూరు, ఖాజీపేట ప్రత్యేకంగా సాగు చేసేవారు. జిల్లాల విభజన అనంతరం అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఊటుకూరు, వెంకటరాజంపేట, పుల్లంపేట మండల ప్రాంతాలు. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరం పాడు, పెద్దఓరంపాడు, గాదెల, వెంకటరామపురం, తల్లెంవారిపల్లె, అయ్యలరాజుపల్లె, ఓబులవారిపల్లె, పున్నాటివారిపల్లె, కమ్మపల్లి వంటి గ్రామాల్లో కొన్ని కుటుంబాలు పూర్తి స్థాయిలో తమలపాకు పంటనే ప్రధాన ఆదాయ వనరులుగా సాగు చేస్తారు.

రెండేళ్లగా తమలపాకు సాగులో అధిక మొత్తంలో ఖర్చులే గాని ఆదాయం తక్కువగా వస్తోందని సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత కొలతల మేర సాలు తోలి అవిశ విత్తనాలను ఒత్తుగా చల్లుకోవాలి. నాటిన 40 రోజుల నుంచి విత్తనపు తీగ వేసుకోవడానికి అనువుగా తయారవుతుంది. 60 రోజుల నుంచి నూతన తోట నుంచి దిగుబడి మొదలవుతుంది. అంతవరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. సాగు ఖర్చులు కూడా పెరిగిపోవడంతో తమలపాకు దిగుబడి మొదలయ్యే వరకు ఎకరాకు లక్ష రూపాయలకు పైనే పెట్టుబడి పెట్టాల్సివస్తుందని రైతులు వివరించారు. ఒకసారి సాగు మొదలు పెడితే మూడేళ్ల వరకు దిగుబడి వచ్చేది. పంట కాలం ఎక్కువకాలం రావడంతో ఖర్చులు పోను రైతులకు ఆశాజనకంగా మిగులు బడి ఉండేది. ఏటా తిరిగి సాగు చేయడం ద్వారా పంట కాలం తగ్గిపోయింది. ప్రస్తుతం ఏడాదికి మించి ఉంటే రోగాలతో నిలువునా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన దిగుబడి వస్తే అమ్మకాల ధర పలకడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుట్టకు రెండు వేల తమలపాకులు ఉంటాయి. వాటిని కోయడానికి వంద రూపాయలు కూలీ అయితే బుట్ట, వరిగడ్డి, పురికోస, భోజనం కలిపి సుమారు రూ.200 అవుతున్నాయి. వీటిని హైదరాబాదు మార్కెట్‌కు తరలిస్తే వారు నచ్చిన రేటు పట్టీ కట్టి పంపుతారు. పండుగ సీజన్లలో అమ్మకపుదారులు అధిక మొత్తంలో తమలపాకులు కావాలని కోరేవారు. డిమాండ్‌కు తగ్గట్టుగా రేట్లు కూడా ఉండేవి. అయితే సరకు బాగా ఉంటే పండగ సమయాల్లో రూ. 500 నుంచి రూ.600 అమ్మకాలు చేపడుతున్నారు. మిగిలిన సరకు మొత్తానికి రూ.80 నుంచి రూ.150 వరకు రేట్లు కడుతుండడంతో రైతులు ఇవ్వక తప్పడంలేదు. అధిక ఖర్చులు అవడంతో సాగును తగ్గించేస్తున్నారు. రేట్లు తగ్గడానికి కారణం అడిగితే గతంలో వారానికి మూడు రోజులు మాత్రమే హైదరాబాద్ మార్కెట్‌కు సరకు వెళ్లేదని, ప్రస్తుతం ప్రైవేటు బస్సుల ద్వారా రోజూ తమలపాకులు వెళుతుండ డంతో మార్కెట్టు కట్టడి చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా ఎకరాకు పైబడి సాగుచేసే రైతు 20 నుంచి 30 సెంట్లకే పరిమితం అవుతున్నారు. ఖర్చులు భరించలేక నచ్చిన పంట వదులుకోలేక కొంతే సాగు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ సాగు కోసం....



మేము కొన్నేళ్లుగా తమలపాకు సాగుతో జీవనం సాగిస్తున్నాం. తమలపాకు సాగులో తెలిసినన్ని మెళుకువలు మరొక పంట సాగుబడికి తెలియదు. అప్పట్లో డబ్బు బాగా వచ్చేవి. ప్రస్తుతం చాలా ఇబ్బందిగా ఉంటోంది. మరొక పంట సాగు చేయడానికి ప్రత్యామ్నాయంగా చూస్తున్నాం.

ప్రసాద్‌రెడ్డి, ఓబులవారిపల్లె



డిమాండ్ తగ్గింది



రోజూ హైదరాబాదు మార్కెట్‌కు తమలపాకులు వెళ్లడంతో డిమాండ్ తగ్గింది. బస్సుల ద్వారా వంద నుంచి 500 బుట్టలు వెళుతున్నాయి. ఫలితంగా రోజూ అమ్మకాలు సాగుతూ ఉండడంతో కొందరికి లాభాలు వస్తున్నాయి. రోజూ సరకు వెళ్లకుండా కట్టడి చేస్తే డిమాండ్ పెరిగి అందరికీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

దాసరి సుబ్రమణ్యం, అయ్యలరాజుపల్లె.

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడు మృతి



సురేంద్ర

కాశినాయన సెప్టెంబరు22: నర్సన్నపల్లె వాసి బుస్సాని సురేంద్ర(26) ట్రాక్టర్‌లో వెళుతూ ప్రమాద వశాత్తు చెట్టుకు తగిలి మృతి చెందినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. సుబ్బయ్య కుమారుడు సురేంద్ర శనివారం పొలం సేద్యం చేసేందుకు ట్రాక్టర్‌లో వెళుతుండగా మూలపల్లె మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి వేపచెట్టును ఢీకొంది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి శవాన్ని పోస్టమర్టం కోసం తరలించామన్నారు.

చికిత్స పొందుతూ మహిళ...

సిద్దవటం, సెప్టెంబరు 22: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఎం.లక్ష్మీదేవి(48) మృతిచెందినట్లు మృతురాలి బంధువులు తెలియజేశారు. కడప - చెన్నై రహదారి మాధవరం-1 వద్ద పార్వతీపురం వాసి ఎం.లక్ష్మీదేవి శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. తలకు గాయమైన ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తుండగా శనివారం రాత్రి 10 గంటలకు మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

వ్యక్తి పై దాడి - తీవ్రగాయాలు



దాడి వివరాలు తెలుపుతున్న ప్రహ్లాద

రైల్వేకోడూరు, సెప్టెంబరు 22: ఓబనపల్లె దళితవాడ వాసి కసుపర్తి ప్రహ్లాదపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాల్లోకెళితే... ఓబనపల్లె దళితవాడకు వాసి ప్రహ్లాదకు ఆటోమొబైల్స్ దుకాణం ఉంది. రోజు మాదిరే మధ్యాహ్నం దుకాణం మూసుకుని ఇంటికి వెళుతుండగా దళితవాడ టర్నింగ్ వద్ద కాపు కాసిన సుమారు నలుగురు వ్యక్తులు రెండు మోటారు బైకుల్లో వేగంగా వచ్చి రాడ్లతో దాడి చేసి పరారీ అయ్యారని గ్రామస్తులు తెలిపారు. ప్రహ్లాదకు గతంలో గ్రామానికి చెందిన ఈ. శ్రీనువాసులుకు పాతకక్షలు ఉన్నాయని ఈ దాడి కూడా పాతకక్షలతోనే జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిందితులు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు, ఎవరు పంపారనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బాధితుడి ఫిర్యాదుపై విచారిస్తున్నారు.

పేలుళ్లతో నెర్రెలు చీలిన ఇళ్లు



మైదుకూరు రూరల్, సెప్టెంబరు 22: ముద్దిరెడ్డిపల్లెలో ఆదివారం బాంబు పేలుళ్లకు గ్రామంలోని ఇండ్లు నెర్రెలు చీలాయి. గ్రీన్ ఫీల్డ్ హైవే ఆధ్వర్యంలో మైదుకూరు నుంచి సింగరాయకొండ వరకు కొనసాగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా ముద్దిరెడ్డిపల్లె వద్ద ఒక గుట్టను పగులకొట్టేందుకు బాంబులు పెట్టి పేల్చి కంకర తీస్తున్నారు. కొద్ది మోతాదులో మాత్రమే మందుగుండు పెట్టి పేల్చాలి. కానీ ఎక్కువ మోతాదు మందు పెట్టడంతో గ్రామంలోని ఇండ్లు చాలా వరకు నెర్రెలు చీలాయి. దీంతో గ్రామస్తులు ఆపనులను ఆపించేశారు. సోమవారం గ్రామస్తులు, కాంట్రాక్టర్లు సమావేశం కానున్నారు.

పునరావాసానికి మతిస్థిమితంలేని వారు

మానవతా దృక్పథంతో స్పందించండి ● ఆస్పత్రిలో చేర్చడానికి సహకరించండి : మనోబంధు ఫౌండేషన్ ఫౌండర్



మానసికంగా వైకల్యంతో రోడ్లపై తిరిగే వారిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 22: మానసిక రుగ్మతతో బాధపడుతున్న వారిని మానవతాదృక్పథంతో పునరావాసా కేంద్రానికి తరలించేందుకు సహకరించాలని మనోబంధు ఫౌండేషన్ ఫౌండర్ రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదరించే వారు లేక వీధుల్లో మతిస్థిమితంలేకుండా తిరిగే వారి జాడ తెలపాలని కోరారు. ప్రొద్దుటూరు ఎర్రగుంట్ల ప్రాంతాల్లో మతి స్థిమితం లేని వారిని గుర్తించి స్థానిక పోలీసుల సహకారంతో వారిని అంబులెన్సులో కడప రిమ్స్‌లోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రానికి తరలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో మన చుట్టూ మతిస్థిమితం లేక దుర్భరంగా జీవిస్తుంటారన్నారు. ఇలాంటి వారు ఆదరించే వారు లేక ఎటువంటి దిక్కు లభించక నిరాశ్రులై వీధుల్లో తిరుగుతూ వుండడం మానవత్వానికి మచ్చ అన్నారు. వారిని సమీకరించి తగు వైద్య వసతి సదుపాయాలు ఏర్పరచి వారిని వారి కుటుంబాలతో తిరిగి కలిపేలా చేయడం కోసం మనోబంధు సంస్థ కృషి చేస్తోందన్నారు. 2021 అక్టోబరులో ఈ సంస్థను ప్రభుత్వ మాజీ కార్యదర్శి అజయ్ కల్లాం ద్వారా ప్రారంభించామన్నారు. మతి స్థితిమితం లేక నిరాశ్రయులైన వారువుంటే 92465 63738 మొబైల్ నెంబర్లుకు సప్రందించాలన్నారు. వారిని స్వచ్ఛంద సంస్థలు పోలీసులు సహకారంతో పునరావస కేంద్రంలో చికిత్స అందించి వారికి కొత్త జీవితం ప్రసా దించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఆర్‌డీ పుత్తా శివారెడ్డి, కుమార స్వామి రెడ్డి, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

చాంపియన్ షిప్ పోటీల్లో మెరిసిన ఆణిముత్యాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు22: కర్నూలు జిల్లాలో ఆదివారం జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీల్లో లీడ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ముగ్గురు గోల్డ్ మెడల్, మరో ముగ్గురు సిల్వర్ పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. వీరిలో ముగ్గురు సిల్వర్ పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. పుల్లగూర గంగాతనోశ్, తహోమరచన్, ముమెన్, బంగారు పతకాలు సాధించగా కొండూరు చేతన్ వర్మ, చరిష్మా, ఆసిఫా వెండి పతకాలు సాధించారు.

పులివెందులలో భారీ చోరీ

- 750 గ్రాముల బంగారు, రెండున్నర కిలోల వెండి, లక్ష రూపాయలు చోరీ



వస్తువులు చిందర వందరగా పడేసిన దృశ్యం

పులివెందుల టౌన్, సెప్టెంబరు 22: విజయ హోమ్స్ ప్లాటు నెం.149లో హెచ్‌పీ గ్యాస్‌డీలరు హరినాథరెడ్డి ఇంట్లో దొంగలు జొరబడి బంగారు, వెండి నగలు సహా లక్ష రూపాయలు నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా.. వ్యక్తిగత కారణాలతో హరినాద్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బెంగుళూరు వెళ్లారు. శనివారం అర్ధరాత్రి దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 750 గ్రాముల బంగారు, రెండున్నర కిలోల వెండి, లక్ష రూపాయల నగదు చోరీ చేశారు. ఆదివారం ఉదయం పనిమనిషి ఇంటి వద్దకు రాగా మెయిన్ డోరుకు ఉన్న తాళాలు పగలగొట్టి ఉండడం చూసి ఇంటి యజమానులకు ఫోను ద్వారా సమాచారం అందించింది. దీంతో వారి బంధువులు వచ్చి ఇంట్లో ఉన్న వస్తువులను చెల్లాచెదరుగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచా రం అందించారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ మురళినాయక్, సీఐ జీవన్ గంగానాథ్‌బాబు, సిబ్బందితో చేరుకున్నారు. యజమానికి సమాచారం అందించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపి ఫింగర్‌ప్రింట్స్ సేకరించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ విలేకరులకు తెలిపారు.



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

రాజంపేటలో రెచ్చిపోయిన దొంగలు



చిందరవందరగా ఉన్న వస్తువులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 22: స్థానిక క్రిష్ణానగర్‌లో శనివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో దొంగలు రెచ్చిపోయారు. పుల్లంపేట మండలం కొత్తపల్లె వాసి టీచర్ ఇంద్రావతి చిత్తూరు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నాగరాజు దంపతులు కుమారుడితో కలిసి బెడ్‌రూంలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని అగంతకుడు ఇంట్లోకి చొరబడి గదిలోని తాళాలు తీసి బీరువాలో ఉన్న 20 తులాల బంగారు, 2 లక్షల నగదు అపహరించినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకు న్నారు. పట్టణ సీఐ ఎల్లమరాజు, ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, లోకేష్, ఏఎస్ఐ వర్మ తదితర పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలాన్ని రంగంలోకి దింపి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఫారెస్టు అధికారుల బదిలీ

కడపక్రైం సెప్టెంబరు 22: జిల్లాలో పనిచేస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారులను బదిలీ చేస్తు ఆశాఖ ఉన్నాతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బద్వేలులో పనిచేస్తున్న పి.వి.రమణారెడ్డిని కర్నూలు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా, కడప ఎఫ్ఎస్‌పి విభాగంలో పనిచేస్తున్న నయీమ్ అలీని బద్వేలుకు, మదనపల్లిలో పనిచేస్తున్న మదన్ మోహన్ రెడ్డిని కడప డివిజన్ ఫ్లయింగ్ స్క్వాడ్, శ్రీశైలం టైగర్ జోన్‌లో పనిచేస్తున్న నరసింహులు జమ్మలమడుగు ఎఫ్ఎఫ్ రేంజ్‌కు బదిలీ అయ్యారు.

ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర-2047

క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా ప్రజల అభిప్రాయాల సేకరణ

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 22: స్వర్ణాంధ్ర ప్రదేశ్ -2047 లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శివశంకర్ ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దూర దృష్టితో స్వర్ణాంధ్ర-2047 విజన్ అభివృద్ధి కోసం సమగ్రంగా కసరత్తు చేపట్టిందన్నారు. స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం అనేది ఆర్థికాభివృద్ధి సామాజికాభివృద్ధి వాతావరణ సుస్థిరతలపైన దృష్టి సారిస్తూ 2047 నాటికి భారత దేశానికి ఒకస్థూలవృద్ధి కేంద్రంగా రాష్ట్రాన్ని తయారు చేసేందుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను నిర్దేశిస్తుంది. 1వ తేదీన ఈ విజన్ -2047 పత్రాన్ని ఆవిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు స్వర్ణ కడప దిశగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కరపత్రాలు, పోస్టర్ల ద్వారా సమాచారం చేర వేస్తామన్నారు ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి స్వర్ణాంధ్ర-2047పై సలహాలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు.


గాలివీడు:బోరెడ్డిగారిపల్లెలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో నేతలు


పెనగలూరు: నల్లపురెడ్డిపల్లెలో..


ఓబులవారిపల్లె: కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్వేలి, సెప్టెంబరు 22: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కె.కందులవారి పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇది మంచి ప్రభుత్వం రెండో రోజు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కె.కందులవారిపల్లెను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం రూపానందరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, ప్రజలందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 16,437 సీట్లకు మెగా డీఎస్సీ ప్రకటించిందని, సామాజిక పెన్షన్ల పెంపు తదితర హామీలను ఇప్పటికే అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేకే చౌదరి, సర్పంచ్ ధనలక్ష్మి, ఏదోటి రాజశేఖర్, గుత్తి నరసింహ, మాదాసు నరసింహ, బాలు రామాంజ నేయులు, లాయర్ బాలాజీ, ఆకేపాటి వెంకటరెడ్డి, తాతంశెట్టి నాగేంద్ర, గుండయ్యనాయుడు, రవికుమార్, బొంతల నాగేశ్వరరావు, బాలకృష్ణయాదవ్, అనంతయ్యయాదవ్, కాకర్ల నాగార్జున, కూటమి నేతలు, ప్రజలు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: బోరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌బీ ఆధ్వర్యంలో బోరెడ్డిగారిపల్లె, సుగాలి తాండా, బక్కిరెడ్డిగారిపల్లె, గొందిపల్లెల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు చంద్రప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ, టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఖాదర్‌బాషా, మహిళా పోలీసు జ్యోతి, టీడీపీ నాయకులు శివశంకర, బాలాజీ, పద్మనాభయ్య, పక్కీర్‌బాషా, మహమ్మద్, ఫీల్డ్ అసిస్టెంట్ వీరాంజనేయులు, ఎస్టీ నాయకులు నాగేశ్వర్‌నాయక్, మల్లేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

పెనగలూరు: సిద్దవరం గ్రామ పంచాయతీలో న్యాయవాది గోపుగారి రెడ్డయ్య నల్లపురెడ్డిపల్లెలో డీసీసీబీ డైరెక్టర్ మాజీ లేబాక శ్రీనివాసులరెడ్డి ఈటమాపురంలో క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చకాయల రవిశంకర్, కంబాలకుంటలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిన మదన్ మోహన్, ఓబిలిలో బూత్ ఇన్‌చార్జి శ్రీనివాసులు అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు.

ఓబులవారిపల్లె: ఓబులవారిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి భారతి, వీఆర్వో హరిబాబు, సచివాలయ సిబ్బందితో పాటు మండల సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలో టీడీపీ నాయకులు పయ్యావుల కోటేశ్వరరావు, నాగేంద్రనాయుడు, సర్పంచ్ కుమారుడు గద్దె పెంచలయ్య తదితరుల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

వీరబల్లి: పెద్దివీడు ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీటి సమస్య, పింఛన్ల మంజూరుపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న పరిపాలన సమర్థవంతంగా కొనసాగేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నేతి ఆంజనేయులు, రామాంజనేయులు, టీడీపీ మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, పద్మనాభరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కల్లూరి రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని గుర్రప్పగారిపల్లెలో మండల టీడీపీ అధ్యక్షుడు భాను గోపాల్ రాజు ఇంటింటికి వెళ్లి కరపత్రంతో పాటు, ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. మండల టీడీపీ నాయకులు సురేంద్రారెడ్డి, అమరేశ్వరరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు రెడ్డి, వీరామృతనాయుడు, రాయుడు, జనమేజయుడు, రామకృష్ణంరాజు, నాగయ్యనాయుడు, బాలరాజు, సుగ్రీవరాజు, జయచంద్రరాజు, వెంకట్రమణ, చలపతి, తిమ్మయ్య, తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

రాజంపేట: మన్నూరు, ఎర్రబల్లె ప్రాంతాల్లో 25వ వార్డు కౌన్సిలర్ మిరియాల చెంగమ్మ, రాష్ట్ర టీడీపీ బీసీ నాయకులు ఇడిమడకల కుమార్ తదితరులు ప్రచారంచేశారు.

సుండుపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామచంద్ర కరపత్రాలు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని ఇంటింటికి తెలియజేసి 2047 విజన్‌కు శ్రీకారం చుట్టేందుకు సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు . 14 గ్రామ పంచాయతీల్లో సచివాలయ ఉద్యోగులు కూటమి నాయకులు. తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రజలతో మమేకం కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దైవాధీనం, టీడీపీ బూత్ ఇన్‌చార్జి మాలేపాటి సురేశ్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు శివరామిరెడ్డి, ప్రసాద్‌రాజు, శివరాంనాయుడు, మేకల మహబూబ్ బాషా, మస్తాన్‌బాబు, జనసేన నాయకురాలు రెడ్డిరాణి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బెల్లాల రమణ, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి 26 వరకు గ్రామసభలు

నందలూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సౌభాగ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 23న లేబాక, నాగిరెడ్డిపల్లె-1, నందలూరు-1, 24న నాగిరెడ్డిపల్లె-2, నందలూరు-2, టంగుటూరు, 25న ఆడపూరు, నాగిరెడ్డిపల్లె-3, పాటూరు, 26న నల్లతిమ్మయ్యగారిపల్లె, పొత్తపి, ఎర్రచెర్లోపల్లి సచివాలయాల పరిధిలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి, కూటమి నేతలు


వీరబల్లి: వినతిపత్రాలు స్వీకరిస్తున్న సుగవాసి సుబ్రమణ్యం


సుండుపల్లె: కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు


మన్నూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

30 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 22: మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 60 మందికి పరీక్షలు నిర్వహించి, అర్హులైన 30 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 26 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

సుండుపల్లె, సెప్టెంబరు 22: పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, రూ. 16,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని ఎర్రమనేనిపాలెం దక్షిణ భాగాన పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంలో ఆదివారం దాడులు నిర్వహించా మన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

సుండుపల్లె, సెప్టెంబరు22: మండల కేంద్రంలో ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఇద్దరు పట్టుబడడంతో వారిపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం వాహనదారులకు లైసెన్స్, హెల్మెట్, ద్విచక్ర వాహనాలకు సంబంధించిన పేపర్లు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

కారు, బైకు ఢీ

రాజంపేట టౌన్, సెప్టెంబరు 22: పట్టణంలోని ఫ్లై ఓవర్‌పై ఆదివారం రాత్రి చక్రంపేటకు చెందిన ర మణ, రాజా కారులో ప్రయాణిస్తూ ఓ ఆటోను తప్పించబోయి, అదే మార్గంలో వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. అతివేగం కారణంగా కారు ఫ్లైవర్‌ఓవర్ ఫుట్‌పాత్‌పైకి ఎక్కి సేఫ్టీవాల్‌ను బలంగా తాకి ఆగిపోయింది. బైక్‌పై వస్తున్న బ్రాహ్మణపల్లికి చెందిన శంకర్ కాలికి స్వల్పగాయం అయ్యింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి చేసి చూపిస్తా..

● రాష్ట్ర మంత్రి మండిపల్లి..
● గ్రామాల్లో విస్తృత పర్యటన
● ప్రజా సమస్యలపై ఆరా..

రాయచోటి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి, అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివారం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 22: మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బీ.యర్రగుడి పంచాయతీలోని కావల్లి, బీఏ నాగిరెడి పల్లెల్లో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. పాలెంగొల్లపల్లి, బీ.యర్రగుడి, చెంచపల్లి గ్రామాలకు రోడ్ల ఏర్పాటుతోపాటు, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ ఏడాది మండలంలో కరువు నెలకొనడంతో ప్రత్యేక చర్యలతో రైతులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం వెంకట్రమణ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్‌మోహన్, ఆరీఫ్, వెంకట్రమణ, జీకేరెడ్డి, దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, నాయకులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

రాయచోటిటౌన్: మండలంలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లెలో తాగునీటి సమస్య అధికంగా ఉందనిరాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు ఆధ్వర్యంలో స్థానిక మహిళలు మంత్రి దృష్టికి తేవడంతో సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించా లని మంత్రి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో గ్రామంలో బోరు ఏర్పాటు చేసి, నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మేస్త్రి వెంకట్రమణ, కేతినేని రాజశేఖర్‌నాయుడు, ఆంజనేయులునాయుడు, డేరంగుల రామచంద్ర, డీలర్ అంబటి గంగయ్య, అనుమల వెంకట్రమణ, నక్కావాండ్లపల్లె ప్రజలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల బదిలీలు, భూ సమస్యలు, తాగునీటి సమస్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు.


ప్రజా దర్బారులో మంత్రికి సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

మైనార్టీల సమస్యలు పరిష్కరిస్తాం

సంబేపల్లె, సెప్టెంబరు 22: మండలంలోని దేవళంపేటలో మైనార్టీలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, తాగునీరు, డ్రైనేజీ, భూ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆవులవాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, సంబేపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రాజును మంత్రి పరామర్శించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, టీడీపీ నాయకులు సుబ్బరాజుయాదవ్, భయ్యారెడ్డి, రాళ్లపల్లి వేణుగోపాల్ నాయుడు, వెంకటేశ్వర నాయుడు, రాహుల్‌నాయుడు, బాబురెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ పవన్ కుమార్‌రాజు, రామాంజుల్‌రెడ్డి, సూరి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పాల్గొనే కార్యక్రమాలివే..

రాయచోటి టౌన్: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈనెల 23న సోమవారం ఉదయం 6 గంటలకు తమ నివాసంలో ప్రజా దర్బార్, మధ్యాహ్నం 12 గంటలకు రాయచోటి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభం మధ్యాహ్నం 1 గంటకు రామాపురం మండలం బండపల్లి సమీపంలోని మహావిష్ణు ఆలయానికి వెళ్లే నూతన రోడ్డును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గువ్వలచెరువులో ఇది మంచి ప్రభుత్వం ప్రజాదర్బార్‌లో పాల్గొంటారని పౌర సంబంధాల శాఖ అధికారులు తెలిపారు.

మాతమ్మ ఆలయానికి 20 వేలు విరాళం


పుల్లంపేట, సెప్టెంబరు 22 : మండల పరిధిలోని రెడ్డిపల్లె అరుందతివాడలో మాతమ్మగుడి నిర్మాణానికి రెడ్డిపల్లెకు చెందిన రొంపిచెర్ల లక్ష్మీనారాయణ, అనిత దంపతులు ఆదివారం 20 వేల రూపాయలు వితరణ చేశారు. తన తండ్రి రొంపిచర్ల నాగేశ్వరరావు, గౌరీశంకర్, మల్లికార్జున బోదకుల జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేశామన్నారు.


విరాళం అందజేస్తున్న లక్ష్మీనారాయణ దంపతులు



లడ్డు ప్రసాదం కల్తీపై విచారణ చేయాలి

పుల్లంపేట, సెప్టెంబరు 22: తిరుమలలో లడ్డూ ప్రసాదం కల్తీపై కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ చేయాలని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పర్వత వర్ధినిదేవి శాంతిలింగేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ 66 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పోకల ప్రభాకర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు, నవరాత్రుల్లో ఆయుధ పూజ తదితర కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా పుల్లంపేట నుంచి 13 మంది, రాజంపేట నుంచి ఒకరు వీహెచ్‌పీలో చేరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, భజరంగ్‌దళ్ సభ్యులు పెంచల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి జయసింహ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

రాజంపేట,: ప్రపంచ వ్యాప్తంగా హిందువులకు ఆరాధ్యదైవమైన తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో గత వైసీపీ ప్రభుత్వం కల్తీలకు పాల్పడడం దారుణమని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం రాజంపేటలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీటీడీ మాజీ చైర్మన్‌లు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గత ఈవో ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినారాయణ, సూర్యచంద్ర, రమణ, వేణుప్రసాద్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి: సీపీఐ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 22: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయినా ఎందుకు రైల్వేకోడూరుకు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించ లేదని సీపీఐ సీనియర్ నేత, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేక పోవడంతో భూ బకాసురులు దళిత, గిరిజనుల భూములను దౌర్జన్యంగా లాక్కుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వంక పోరంబోకు, దేవదాయ, చెరువులు, గ్రామ కంఠం, ప్రభుత్వ బంజరు భూముల ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఎక్కువ శాతం గిరిజనుల భూములు ఆక్రమణలకు గురౌతున్నాయని ఆరోపించారు. రాజకీయ నాయకులు కొండలు, గుట్టలు ఆక్రమించుకుంటు న్నారని తెలిపారు. ఐదు మండలాల్లో రెగ్యులర్ తహసీల్దార్లు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఐదు మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లను నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో నాయకులు తిప్పన ప్రసాద్, మొగిలి వినయ్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి

పెనగలూరు, సెప్టెంబరు 22: పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని చిలకలూరి మండల ఈవోపీఆర్డీ సుబ్బరాయుడు వ్యాపారులకు సూచించారు. ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని చికెన్, మటన్, చేపల వ్యాపారులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉన్నత పాఠశాల సమీపం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు మటన్, చికెన్, చేపలు అమ్మేవారి వద్దకు వెళ్లి ఆయన పలు సూచనలు చేశారు. రోడ్డు పక్కన బహిరంగంగా విక్రయించవద్దన్నారు. హోటళ్లు, బేకరీ షాపుల వద్దకు కూడా వెళ్లి ఎప్పటికప్పుడు తయారు చేసిన శుచి, శుభ్రంగా ఉన్న ఆహార పదార్థాలను విక్రయించాలని కోరారు. రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోను విక్రయించరాదని తెలిపారు. నాణ్యతలేని ఆహార పదార్థాలను అందిస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు.


రోడ్డుపక్కన మాంసం వ్యాపారికి సూచనలిస్తున్న ఈవోపీఆర్డీ సుబ్బరాయుడు

పంచాయతీని పరిశుభ్రంగా ఉంచుకుందాం


ర్యాలీ చేస్తున్న యువకులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 22: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీలోని వీధులను సర్పంచ్ ఆనాల చిన్నచంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు, ప్రజలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊరిలోని యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పొత్తపిలో బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

నందలూరు, సెప్టెంబరు 22 : మండలంలోని పొత్తపి గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఆంధ్ర శివారెడ్డి ఆధ్వర్యంతో ఆదివారం నిర్వ హించిన ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశే ష స్పందన లభించిందని రాజంపేట అసెంబ్లీ కో కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ఎంత వేగంగా పరిగెడుతోందో స్థానిక ప్రజలకు వివరించినట్లు తెలిపారు. 2047 కల్లా ప్రపంచంలో అభివృద్ధి చెందిన మొదటి మూడు దేశాల్లో ఒకటిగా భారతదేశాన్ని నిలపాలన్నది మోదీ దృఢ సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మురళి, మండల యువమోర్చా నాయకులు చుక్కా శ్రీనివాసులు, జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఒంటిమిట్ట, సెప్టెంబరు 22: మండలం కేంద్రంలోని జడ్పీ హై స్కూల్లో ఆకేపాటి ఫౌండే షన్ ట్రస్టు ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ఆదివారం కంటి వైద్య శిబి రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అవసర మైన వారికి తిరుపతిలోని అరవింద నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్లు చేయించి, మందులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తిలూరు శేషారెడ్డి, నందకిషోర్ రెడ్డి, మాధవరెడ్డి, సర్పంచులు శివనారాయణ, వెంకటరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు


వైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పుల్లంపేట, సెప్టెంబరు 22 : ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దారు అరవింద కిషోర్ హెచ్చరించారు. మండల పరిధిలోని వత్తలూరు సర్వే నంబరు 1138లో ఆదివారం ప్రభుత్వ భూమి ఆక్రమించి బోరు వేస్తుండడంతో తహసీల్దారు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేసినా, ప్రభుత్వ భూములు ఆక్రమించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజంపేట ప్రైవేటు పాఠశాలల నూతన కార్యవర్గం


ప్రైవేటు పాఠశాలల నూతన కార్యవర్గ సభ్యులు

రాజంపేట, సెప్టెంబరు 22 : రాజంపేట ప్రైవేటు పాఠశాలల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా శ్రీవిద్యానికేతన్ కరస్పాండెంట్ అబ్బూరి ప్రభాకర్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కింగ్‌బ్రిడ్జి పాఠశాల కరస్పాండెంట్ కె.సుభాష్, కోశాధికారిగా ఎస్.రవీంద్రనాయుడు, ఉపాధ్యక్షుడుగా కె.భరత్‌కుమార్‌రాజు, జి.రెడ్డయ్య నాయుడు, సహాయ కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, నవాబ్‌ఖాన్, లీగల్ అడ్వైజర్‌గా బాసినేని రమేష్ నాయుడు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు గంగయ్య, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.

గంగమ్మకు బోనాలు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 22: మండలంలోని అనంతపురం గ్రామంలో ఆదివారం గంగమ్మ కు అనంతపురం, చౌటపల్లి, కొత్తపల్లి, ఏనుగులవాళ్లపల్లి హరిజనవాడ, గుడ్లవారిపల్లె గ్రామ ప్రజలు బోనాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఘనంగా పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి మారుతీప్రసాద్, చైర్మన్ మురికిలాటి రెడ్డెయ్య ఏర్పాట్లు చేశారు.

తిరుమల ప్రసాదాల్లో కల్తీ మహాపాతకం

- సచ్చిదానంద సరస్వతి



సచ్చిదానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

పుంగనూరు, సెప్టెంబర్ 22: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డు తయారీలో కల్తీ జరగడం మహాపాతకమని శృంగేరి సమీపంలోని హరిహరపురం శ్రీపీఠం పీఠాధిపతి స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి తెలిపారు. ఆదివారం పుంగనూరు కోనేరు వద్ద శ్రీరామానంద తీర్థ సరస్వతి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొనడానికి విచ్చేసిన ఆయనకు బ్రాహ్మణసంఘం, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పుంగమ్మచెరువు కట్టపై వెలసిన వినాయకుడు, కాశీవిశ్వేశ్వరస్వామి, కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలయ్యాక మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ప్రసాదాల్లో కొందరు పరమ దుష్టులు, అత్యాశపరులు కల్తీకి పాల్పడడం బాధాకరమైన విషయమన్నారు. ఈ విషయంలో నెయ్యి కంపెనీ, టీటీడీ, ప్రభుత్వ నిర్లక్ష్యం ఏది జరిగినా తప్పేనని స్పష్టం చేశారు. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను హైందవులందరూ తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఇలాంటి తప్పిదాలు భవిష్యత్తులో జరగకుండా జాగ్రత్త పడాలన్నారు.

మా బిడ్డ మృతికి కారకుడైన ప్రైవేటు వైద్యుడిని అరెస్టు చేయాలి

- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల నిరసన



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న బాధిత కుటుంబీకులు

పుంగనూరు, రూరల్, సెప్టెంబరు 22: వైద్యం వికటించి పది నెలల బాలుడు సాత్విక్ నందన్ మృతికి కారకుడైన ప్రైవేటు డాక్టర్ కార్తీక్‌ను అరెస్టు చేయాలని మృతుడి కుటుంబీకులు డిమాండ్ చేశారు. ఆదివారం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాలుడి మృతదేహానికి వైద్యులు శవపరీక్ష నిర్వహించారు. అనంతరం మృతదేహంతో కుటుంబీకులు నేరుగా కార్తీక్ చిన్నపిల్లల ఆస్పత్రి వద్దకొచ్చారు. 'మా బిడ్డను చంపేసిన డాక్టర్‌ను అరెస్టు చేయండి. మాకు న్యాయం చేయాలి' అంటూ నినాదాలు చేశారు. ఆస్పత్రి మూసేసి ఉండడంతో నేరుగా పోలీస్‌స్టేషన్ వద్దకెళ్లి డాక్టర్‌పై కేసు నమోదు చేసి.. అరెస్టు చేసి న్యాయం చేయాలని మృతుడి తల్లి వెన్నెల కోరారు. సీఐ శ్రీనివాసులు బాధితులతో మాట్లాడుతూ.. వైద్యుడిపై కేసు నమోదు చేశామని, శవపరీక్ష నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి పంపారు.

నేడు మంత్రి రామానాయుడి పర్యటన

గంగవరం, సెప్టెంబరు 22: మండలంలోని పెద్దవెలగటూరు-అప్పినపల్లె, పనపత్తూరు గ్రామాల వద్ద గతంలో ఏర్పాటు చేసి అర్ధాంతరంగా ఆగిన హంద్రీ-నీవా లిఫ్ట్ ఇరిగేషన్ పనులను సందర్శించడానికి నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం రానున్నారు. ఈ మేరకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇద్దరు తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: జోన్-4 పరిధిలో 17 మంది తహసీల్దార్లను పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా బదిలీచేస్తూ సీసీఎల్‌ఏ శ్రీఖేష్ బి.లత్కర్ ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన డి.లోకేశ్వరరావును కర్నూలు జిల్లాకు బదిలీ చేయగా, సత్యసాయి జిల్లా నుంచి ఎస్‌కే హమీద్ బాషాను మన జిల్లాకు కేటాయించారు.

కమర్షియల్ ట్యాక్స్‌లో పలువురి అధికారుల బదిలీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: ఉమ్మడి జిల్లా కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కమిషనర్ భానుప్రకాష్‌ను విజయవాడ రీజనల్ కార్యాలయానికి బదిలీ చేయగా.. ఆయన స్థానంలో విజయవాడ హెడ్‌ఆఫీసు నుంచి విజయభాస్కర్ రానున్నారు. పలమనేరు సహాయ కమిషనర్ రవికుమార్‌రెడ్డిని ప్రొద్దుటూరు-2కు బదిలీ చేయగా ఆ స్థానంలో మదనపల్లె నుంచి శ్రీనివాసరావును నియమించారు. వీరితోపాటు ఆరుగురు డీసీటీవోలు, 12 మంది ఏసీటీవోలు, 12 మంది ఏఈవోలు, 16 మంది ఈటీఏలు బదిలీ అయ్యారు. వీరందరూ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

విద్యుత్ శాఖలోనూ...

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: విద్యుత్‌శాఖలో పలువురిని బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. లైన్ ఇన్స్‌పెక్టర్లు 5మంది, లైన్‌మెన్లు 27, అసిస్టెంట్ లైన్‌మెన్లు 10మందిని బదిలీచేశారు. ఇంకా పలువురు అధికారులను ఈ రాత్రి బదిలీచేస్తూ ఉత్తర్వులురావచ్చని అధికారులు తెలిపారు.

నిరుద్యోగ భృతికి 25వరకు దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 22: జిల్లా వ్యాప్తంగా వేద, ఆగమాలు చదివిన బ్రాహ్మణ యువత నుంచి నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. నిరుద్యోగ బ్రాహ్మణ యువత కోరిక మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 25వతేదీ వరకు పొడిగించినట్లు జిల్లా దేవదాయశాఖ ఏసీ ప్రసన్నలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సుధాకర్ గురుకుల్ సూచించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

- రూ.4లక్షల బంగారం, వెండి, రూ.5వేల అపహరణ

చిత్తూరు, సెప్టెంబరు 22: పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. పైగా ఆ ఇంటి ముందున్న పెంట్‌హౌస్‌లో అందరూ ఉండగా బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిపోయారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరంలోని పోలీసు ఐపీఎస్ గజాణన కాలనీలో ఇర్ఫాన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఈయన ఎస్బీఐలో ఉద్యోగి. ఈయనకు ఒకే కాంపౌండ్‌లో ముందుభాగంలో పెంట్‌హౌస్, వెనుకభాగంలో ఇల్లు ఉంది. ఆదివారం కావడంతో అందరూ పెంట్‌హౌస్‌లో ఉన్నారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటికి తాళం తెరిచి ఉండటంతో బీరువాలోని రూ.4లక్షల బంగారం, వెండితోపాటు రూ.5వేలను ఎత్తుకెళ్లిపోయారు. చంటి బిడ్డతో ఉన్న ఓ మహిళ ఇంట్లోకి వెళ్లిందని ఎదురింటికి చెందిన మహిళ ఇర్ఫాన్‌కు చెప్పింది. దీంతో ఆయన తన కుటుంబీకులతో కలిసి ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువాలోని బ్యాగులో పెట్టిన బంగారం, వెండి, నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని అర్థమవడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15 లక్షల టపాకాయలు స్వాధీనం



చిత్తూరు, సెప్టెంబరు 22: చిత్తూరు నగరంలో వన్ టౌన్ పోలీసులు భారీగా టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బీజెడ్ హైస్కూల్ వెనుకభాగంలోని ఓ పురాతన ఇంట్లో రూ.15 లక్షల టపాకాయలను నిల్వ ఉంచిన విషయాన్ని గుర్తించి ఆదివారం సీజ్ చేశారు. సీఐ జయరామయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీపి రైతులకు చేదు అనుభవాలు

- మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న వైనం

నగరి, సెప్టెంబరు 22: చెరకు పంటను పండించి పది మందికి తీపిని పంచిపెట్టే రైతు చేదు అనుభవాలను చవి చూడాల్సి వస్తోంది. చెరకు పంట ఏడాది కాలం కష్టపడి సాగుచేసినా మిగిలేది స్వేదమే అంటున్నారు రైతులు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదేళ్లక్రితం నాలుగు చక్కెర పరిశ్రమలుండేవి. నింద్ర మండలంలో నేటమ్స్, బుచ్చినాయుడుకండ్రిగలో మయూర, పుంగనూరులో వాణి, ఎస్‌ఆర్‌పురంలో సాగర్ చక్కెర పరిశ్రములుండేవి. నేడు కేవలం సాగర్ చక్కెర పరిశ్రమ ఒక్కటే ఉండటంతో రైతులు ఎక్కువగా దళారులపై ఆధారపడుతున్నారు. తమిళనాడులోని సెంజి, బన్నారి, నెల్లికుప్పం వద్ద ఈఐడీ ప్యారీ పరిశ్రమలు నడుస్తున్నాయి. అక్కడి పరిశ్రమలు టన్ను చెరకుకు రూ.3,600-3,700 వరకు చెల్లిస్తున్నాయి. మన జిల్లాలోని ఎస్‌ఆర్‌పురం మండలంలోని సాగర్ చక్కెర పరిశ్రమ మాత్రం 2021-22లో రూ.2850, గత ఏడాది రూ.3000 రవాణా చార్జీలతో కలిపి ప్రారంభంలో చెల్లించారు. సంక్రాంతి తర్వాత టన్నుకు రూ.100 పెంచారు. సాగు కోసం రైతుల ఖర్చులు పెరుగుతున్నా.. మద్దతు ధర ఆశించిన స్థాయిలో లేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఖర్చులిలా..

టన్ను చెరకు కటింగ్ చేయాలంటే గతంలో రూ.400 నుంచి రూ.500 ఉండేది. ఇపుడు ప్రారంభంలోనే రూ.600-700 చెల్లించాల్సి వస్తోంది. అలాగే కూలీలకు రెండేళ్ల కిందట మహిళలకు మధ్యాహ్నం వరకు రూ.120 ఉండగా, నేడు రూ.200 చెల్లిస్తున్నారు. మగవారికి రూ.300 ఉంటే ఇపుడు రూ.400 చెల్లిస్తున్నారు. నాగలికి రూ.600 ఉండగా రూ.800, బోదె తోలడానికి రూ.800 ఉంగా రూ.1100 చెల్లిస్తున్నారు. ఎరువులు, పనిముట్ల ధరలు సైతం గతంలో కంటే అధికంగా పెరిగాయి. ఇలా అన్నీ పెరుగుతున్నా చెరకు మద్దతు ధర పెంచడంలో పరిశ్రమలు ముందుకు రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

మద్దతు ధర గతంలో ఇలా నిర్ణయించేవారు

సహజంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభంలో చెరకు మద్దతు ధర ప్రకటించగా.. రాష్ట్రప్రభుత్వం కొంతమేర పెంచితే పరిశ్రమవారు మరికొంత పారితోషికంగా చెల్లించి మద్దతు ధర నిర్ణయించేవారు. జిల్లాలో ఒకే పరిశ్రమ ఉండటమే గాక పంట విస్తీర్ణం మోతాదుకు మించడంతో పరిశ్రమ వారు నిర్ణయించిన ధరకే చెరకును తరలించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



క్రషింగ్‌కు సిద్ధంగా ఉన్న చెరకు తోట

స్థానికంగా పరిశ్రమలు లేకపోవడం వల్లే..



స్థానికంగా పరిశ్రమలు ఉంటే చెరకును తరలించడానికి ఇబ్బందులుండేవి కావు. రవాణా చార్జీలు తగ్గడమే గాక, కూలీలను పరిశ్రమవారు సరఫరా చేయడం జరుగుతుంది. దీంతో రైతులకు ఆశించిన లాభాలు వస్తాయి.

- విశ్వనాథరెడ్డి, టీవీ కండ్రిగ

ఏజెంట్లపై ఆధారపడాల్సి వస్తోంది



కౌలుకు భూమి తీసుకుని పంట సాగు చేస్తున్నాను. స్థానికంగా ఫ్యాక్టరీ లేక ఏజెంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. అదే డైరెక్టుగా ఫ్యాక్టరీకి పంట తరలించుకోగలిగితే ఆశించిన లాభాలు వస్తాయి.

- నవీన్, రైతు, విజయపురం

అయ్యో.. దేవుడా..!

- పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వస్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ముగ్గురి మృతి
- ఏడుగురికి గాయాలు
- మృతులు, క్షతగాత్రులు నెల్లూరువాసులే



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు



మృతిచెందిన బాబు- జగదీశ్వర్ - వెన్నెలమేఘన

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ కుటుంబం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమైంది. మరో అరగంటలో గమ్యం చేరనున్న క్రమంలో తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని చిల్లకూరు వద్ద అదుపు తప్పిన వీరి కారు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరుకు చెందిన ముగ్గురు మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరురూరల్ మండలం కాకుపల్లి గ్రామానికి చెందిన గోసెల బాబు(50), అతడి భార్య లక్ష్మమ్మ చిన్నపాటి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి కిషోర్‌బాబు, కళ్యాణి, మాధవి పిల్లలు. వీరిలో కళ్యాణి నెల్లూరులోని వనంతోపులో ఉండగా, ఆమెకు వెన్నెల మేఘన(8), జశ్వంత్ పిల్లలు. ఈ కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువు రాధాకుమారి, నెల్లూరుకే చెందిన బాబు కుటుంబ స్నేహితులైన సునీల్ కుమార్, జగదీశ్వర్(45) కలిసి ఈనెల 18న పుణ్యక్షేత్రాల సందర్శనకు సునీల్ కుమార్ కారులో వెళ్లారు. కాణిపాకం, కంచి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం వేకువన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చే సమయానికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనరు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తాత, మనవరాలైన బాబు, వెన్నెల మేఘన, జగదీశ్వర్ మృతిచెందారు. లక్ష్మమ్మ, మాధవి, కళ్యాణి, కిషోర్‌బాబు, రాధాకుమారి, సునీల్‌కుమార్, జశ్వంత్‌లకు గాయాలయ్యాయి. వీరికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్ పరిశీలించారు. ఈ మేరకు ఎస్‌ఐ సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాహుకేతు పూజల్లో భర్తతో నమిత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హీరోయిన్ నమిత కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయానికి వచ్చేసారు. అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని సహస్ర లింగం వద్ద ఆమె రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా ఉత్తరప్రదేశ్ సీఎంవో ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్ సింగ్ కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కుక్కల దాడిలో పొట్టేళ్ల మృతి



వరదయ్యపాళెం, సెప్టెంబరు 22: మండలంలోని సీఎల్ఎన్ పల్లిలో కుక్కల దాడిలో 15 పొట్టేళ్లు మృతి చెందడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన ఎస్టీకాలనీలోని వి.రామకృష్ణయ్య, లక్ష్మయ్య, వేమయ్య పొట్టేళ్లు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం కాలనీ సమీపంలోని అరికసేను వద్ద క్వారీలో పొట్టేళ్లు మేత మేస్తుండగా హఠాత్తుగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఏడు గాయపడ్డాయి.

3న పవన్‌కల్యాణ్ తిరుపతి రాక?

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనార్థం అక్టోబర్ 3న తిరుపతి రానున్నట్లు పార్టీ జిల్లా యంత్రాంగానికి ప్రాథమిక సమాచారం అందింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా తిరుపతికి రానున్న ఆయనకు ఘనంగా స్వాగతం పలకడానికి నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు మొదలుపెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ దండపాణి



కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ డీ కృష్ణకుమార్, న్యాయమూర్తి జస్టిస్ దండపాణి, ఎమ్మెల్యే కూన రవికుమార్, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. టీటీడీ ఈ వివరాలను ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 82,406 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,151 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి లడ్డూ కల్తీ బాధాకరం



ప్లకార్డు చూపుతున్న సినీ నటుడు బాలాజీ తదితరులు

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 22: 'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తాం. కళ్లకద్దుకుని తీసుకుంటాం. అలాంటి లడ్డూ అపవిత్రమైందని తెలిసి ఎంతో బాధ కలిగింది. లడ్డూ కల్తీ వ్యవహారం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. దీనికి కారకులైన వారిని శిక్షించాలి' అని సినీ నటుడు బాలాజీ కోరారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే దేనినీ సహించబోమన్నారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన టీడీపీ నేత జగన్నాథం తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

వాహనం ఢీకొని కాలినడక భక్తురాలి మృతి



సరళ మృతదేహం వద్ద విషణ్ణ వదనాలతో భక్తులు

పాకాల, సెప్టెంబరు 22: తిరుమల దర్శనానికి కాలినడకన వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన భక్తురాలు సరళ(43) మృతిచెందారు. పాకాల మండలం శంఖంపల్లె ఆంజనేయస్వామి ఆలయం సమీపాన ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం మండలం నుంచి భక్తుల బృందం కాలినడకన తిరుమలకు బయలుదేరింది. శనివారం రాత్రి అంజనేయ స్వామి ఆలయ ఆవరణలో వీరు సేదదీరారు. తెల్లవారుజామున తిరిగి కాలినడక ప్రారంభించారు. వీరిలో తాటిమానుపల్లెకు చెందిన సరళను గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. తీవ్రగాయాలైన ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. ఈమె భర్త జయపాల్‌తో కలిసి 23 ఏళ్లుగా కాలినడకన తిరుమలకు వెళ్లి దర్శనం చేసుకునేవారు. కళ్లముందే భార్య దుర్మరణం చెందడంతో జయపాల్ కన్నీరుమున్నీరయ్యారు. సీఐ మద్దయ్య ఆచారి, ఎస్‌ఐ మహేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పరిశీలన గృహంలో బాలుడి మృతి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: తిరుపతి శివార్లలోని మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహంలో ఆదివారం అనారోగ్యంతో బాలుడు మృతి చెందాడు. తిరుచానూరు ఎస్‌ఐ జగన్నాథరెడ్డి కథనం మేరకు.. తమిళనాడు గుడియాత్తంకు చెందిన బాలుడు మార్చినెలలో ఇంటి నుంచి పారిపోయి, భాకరాపేట వద్ద ఇటుక బట్టీలో కూలి పనులు చేసుకుంటున్నాడు. అక్కడున్న ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహానికి తరలించారు. రెండు రోజుల క్రితం ఆ బాలుడు అనారోగ్యానికి గురవడంతో మంగళంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో చికిత్స చేయించారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో శనివారం మధ్యాహ్నం రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సమాచారాన్ని పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు తెలియజేశారు.

శ్రీవారిమెట్టు మార్గంలో విజయానందతీర్థ స్వామి



చంద్రగిరి, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి దర్శనార్థం మైసూరు దత్త పీఠాధిపతి విజయానందతీర్థ స్వామి శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు కాలినడకన వెళ్లారు. ఆదివారం ఉదయం శ్రీవారిమెట్టు వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కాలినడకన తిరుమలకు వెళ్లారు. పలువురు స్వామిజీలు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రెండు టన్నుల కూరగాయల వితరణ



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 22: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హోసూరుకు చెందిన శ్రీకాంత్ రెండు టన్నుల కూరగాయలను విరాళంగా ఆదివారం అందించారు. దాతను ఆలయ అధికారులు ఆహ్వానించి.. స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

26న పీఎంఈజీపీ అవగాహన కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ)కు సంబంధించి ఈనెల 26న కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్లు నిండి ప్రాజెక్టు విలువ గరిష్ఠంగా రూ.50లక్షల వరకు పెట్టదలచినవారు, రూ.10లక్షలు ప్రాజెక్టు విలువ దాటిన అభ్యర్థులు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, మొబైల్ నెంబరు, పుట్టిన తేదీ, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, కులధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రం, పాన్‌కార్డు, రేషన్ కార్డు, కరెంట్ బిల్, హౌస్ ట్యాక్స్, పంచాయతీ పర్మిషన్, బ్యాంకు పాస్‌పుస్తకం మొదటి పేజీ, ఇన్సూరెన్స్ కాపీలను అందజేయాలి. మాంసానికి సంబంధించిన యూనిట్లు, ప్రాసెసింగ్, కేనింగ్, మత్తుపానీయాలు, పొగాకు ఉత్పత్తులు, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ తయారీ యూనిట్లు ఈ పథకం కింద అనర్హతగా ప్రకటించారు. వివరాలకు చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని జిల్లా గ్రామీణ పరిశ్రమల మండలి ఆఫీస్‌లో అధికారిని లేదా 94408 14613, 98496 12989 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రాంభూపాల్‌రెడ్డి నియామకం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22: కాంగ్రెస్ చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్‌గా తిరుపతికి చెందిన రాంభూపాల్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఉత్తర్వులు జారీచేశారు. ఈయన గతంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


కలికిరి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి


ములకలచెరువులో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి


కొత్తకోటలో మన మంచి ప్రభుత్వ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

కలికిరి, సెప్టెంబర్లు 22: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ముమ్మాటికీ మంచి ప్రభుత్వమేనని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొటిగా అమలు చేస్తున్నామని, కొద్ది రోజుల్లో అన్ని హామీలు సంపూర్ణంగా పూర్తవుతాయని ఆయన చెప్పారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలోనూ, అనంతరం గుట్టపాలెం పంచాయతీలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దీపావళికి మూడు ఉచిత సిలిండర్ల పథకం అమల్లోకి రానుందని చెప్పడంతో మహిళలంతా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. ప్రతీకారాలు, విధ్వంసాలకు ఒడిగట్టినందువల్లే వైసీపీని 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అహోరాత్రులు కష్టపడుతున్నారని తెలిపారు. బీజేపీ, జనసేనలతో కలిసి కూటమి ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తున్నదని కితాబిచ్చారు. ఉపాధి పథకంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువ పనులు మంజూరయ్యాయని ఆయా గ్రామాల నాయకులు వాటిని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, మాజీ జడ్పీటీసీ చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, కలికిరి సర్పంచ్ యల్లయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఆర్టీసీ రెడ్డెప్ప రెడ్డి, చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గాయత్రి, రమణప్రదీప్ రెడ్డి, యోగేష్ రెడ్డి, కేవీ రెడ్డి, విజయకుమార్ రెడ్డి, ఎంపీడీవో గంగయ్య, తహసీల్దారు మహేశ్వరీ బాయి, సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలో సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

సమావేశం కొనసాగింపుగా ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పంచాయతీ మురుగు నీటి కాలువల శుభ్రం, చెత్త తొలగింపు, తాగునీటి సరఫరా సరిగా పట్టించుకోవడంలేదంటూ పంచాయతీ కార్యదర్శిపై స్థానిక మహిళలు ఫిర్యాదు చేశారు.

ములకలచెరువులో: సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌడసముద్రంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లోనే సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల చేత ఇది మంచి ప్రభుత్వమని తమ ప్రభుత్వం నిరూపించుకుందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ సహకారంలో మహిళలకు గార్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ఇప్పటికే ములకలచెరువు, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో భూములను గుర్తించడం జరిగిందన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో నెలకొన్న ఇసుక సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, ఎంపీడీవో పోలప్ప, తహసీల్దార్ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ గాయత్రి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, మాజీ ఎంపీటీసీ షేక్ మహీరా, గ్రామ కమిటీ అధ్యక్షుడు బుర్రా రమణ, నాయకులు చాంద్‌బాషా, తిరుపాల్, కట్టా హరినాథ్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: ఇది మన ప్రభుత్వం...మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం అన్ని గ్రామ సచివాలయ పరిధిలో సిబ్బంది, టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల యువత అధ్యక్షుడు చినబాబు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను ఒకేసారి 65.18లక్షల మంది వృద్ధులకు ఫించన్ రూ.1000లను అదనంగా పెంచి మొత్తం రూ4వేలను ప్రతి నెల అందిస్తూ, రైతుల కొరకు ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అలాగే అన్న క్యాంటీన్‌లను మళ్లీ ప్రారంభించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. దీపావళికి ఉచితంగా మూడు సిలిండర్‌లు, తల్లికి వందనం వంటివి కూడా త్వరలోనే ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విజయ్, మల్లప్ప, శ్రీపతి పాల్గొన్నారు.

కలకడలో:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కోన, కదిరాయచెరువు, బాలయ్యగారిపల్లె, కలకడ పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, విశ్వనాథ్, రైస్‌మిల్‌రమణ, చంద్రమోహన్, త్యాగరాజు, ఆనంద్‌రెడ్డి, గురుస్వామి, పీరయ్య, ప్రసాద్‌నాయుడు, విశ్వనాథ్‌శెట్టి, రామాంజులు, నౌషాద్, జిలానీలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ప్రజా సుపరిపాలన అందించడంలో టీడీపీ మంచి ప్రభుత్వమని కూటమి నేతలు పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యకక్రమం మండలంలోని వెలిగల్లులో నిర్వహించారు. వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ప్రజాప్రయోజన కార్యక్రమాలపై కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో నేతలు సిద్దవరం ప్రసాద్, రామాంజులు నాయుడు, చలపతి, ప్రభాకరరెడ్డి, కుంటకిందపల్లి చంద్రారెడ్డి, గల్లా నారాయణ, అడపా రామాంజులు, ఇస్మాయిల్, సుబ్బరామిరెడ్డి, బావాజీ, ఎంపీడీవో శ్రీధర్‌రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తైన సందర్భంగా ఆదివారం తంబళ్లపల్లె మండలంలోని పలు పంచాయతీలలో కూటమి నేతలు, అధికారులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సురేంద్రనాథ్, సచివాలయ సిబ్బంది, కూటమి నేతలు రెడ్డికోట గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దిలీప్‌కుమార్, కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

పెద్దతిప్పసముద్రంలో: పెద్దతిప్పసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నేతలు, సచివాలయ ఉద్యోగులు ఇది మంచి ప్రభుత్వం- మనందరి ప్రభుత్వం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా మండలంలోని రంగసముద్రం, రాపూరివాండ్లపల్లె, బూర్లపల్లె, తుమ్మరకుంట, పీటీఎం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు మహ బూబ్ బాష, లక్ష్మీనరుసు, బావన్న, ప్రభాకర్, రెడ్డెప్ప, నాగార్జున, గంగాద్రి, భాస్కర, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, సచివాలయ ఉద్యో గులు పాల్గొన్నారు. బూర్లపల్లెలో సుదాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు, మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో బి.కొత్తకోటలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. జ్యోతిచౌక్ లో బాణసంచాపేల్చి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ల నాయకత్వం వర్థిల్లాలని నినాదాలు చేశారు. అనంతరం కొండాసెంటర్ వద్ద భారీ కేక్ కోసి పంచిపెట్టారు. చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజంపేటబీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మండల ప్రధానకార్యదర్శి దేవరింటికుమార్, టౌన్ కన్వీనర్ బంగారు వెంకట్రమణ, మాజీఏయంసీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు కనకంటిప్రసాద్, సుకుమార్, చాకనారాజా, సురేంద్రబాబు, కురవప్రకాష్, సమీవుల్లా, కుడుంశరత్, రంజిత్, దేవుడునాగరాజు, శ్రీనాథ్, అనసూయమ్మ, గట్టురెడ్డెప్ప, గూటం ఈశ్వరప్ప, ఈవీ రమణ, శిల్ప అంజి, బండిరమణ, గట్టు అంజి, ఓబులేసు, నారాయణరెడ్డి, గోపి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ సస్యశ్యామలమే చంద్రబాబు ధ్యేయం

- హంద్రీనీవా ప్రాజెక్టుకు అడుగులు
- నేడు జలవనరుల మంత్రి పర్యటన
- తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు


మాట్లాడుతున్న తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 22: రాయలసీమలోని కర్నూల్, అనంతపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మానస పుత్రికలైన హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి ప్రాజెక్టులతో రాయలసీమ ప్రాంతాన్ని సుభిక్షం చేయడానికి సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కురబలకోట, మదనపల్లె మండలాల్లో హంద్రీ-నీవా కాలువ పరిశీలించడానికి వస్తున్నారన్నారు. అనంతరం మదనపల్లె మండలం చిప్పిలి గ్రామం వద్ద సమ్మర్‌స్టోరేజి ట్యాంకు పరిశీలిస్తారన్నారు. 2019 మార్చిలో మదనపల్లె పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎస్ఎస్ ట్యాంకుకు కృష్ణా జలాలను వదిలారని కాని మాజీ మంత్రి పెద్దిరెడ్డి మదనపల్లె ప్రజలకు ద్రోహం చేస్తూ 2020లో కృష్ణా జలాలను మదనపల్లెకు వదలకుండా పుంగనూరుకు తీసుకెళ్లారన్నారు. కాని చంద్రబాబు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. అందుకే మంత్రి రామానాయుడును ఇక్కడకు పంపి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలను పరిశీలిస్తున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు, టీడీపీ నాయకులు సోమశేఖర్, మహబూబ్‌ఖాన్, ప్రసాద్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ములకలచెరువు, సెప్టెంబరు 22: విజయవాడ వరద బాధితుల సహాయార్థం బి.కొత్తకోట చాంబర్స్ ఆఫ్ కామర్స్ అసోషియేషన్ సభ్యులు, ములకలచెరువు మండలం వేపూరికోట ఎస్వీ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఆర్థిక సహాయం అందజేశారు. ములకలచెరువులో ఆదివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డిని కలిసి సీఎం సహాయనిధికి చెక్కులకు అందజేశారు. బి.కొత్తకోట చాంబర్స్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, హార్డ్‌వేర్, వాకర్స్, టింబర్, జ్యువెలర్స్, కిరణా, జనరల్ మర్చంట్, క్లాత్ మర్చంట్ అసోషియోషన్ల తరఫున కృష్ణారెడ్డి, ఖాజావలి, సాంబశివరావు, కేశవ, సత్యనారాయణలు రూ.లక్ష చెక్కును అందజేశారు. అలాగే వేపూరికోట ఎస్వీ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి రూ.40వేలు చెక్కును అందించారు.

విజయవాడ వరద సాయ కార్యక్రమాల్లో పీలేరు నేత


వరద బాధితులకు దుస్తులు అందజేస్తున్న డాక్టర్ ఇమ్దాదుల్లా

పీలేరు, సెప్టెంబరు 22: విజయవాడలో జరుగుతున్న వరద సాయ కార్యక్రమంలో ఆదివారం పీలేరుకు చెందిన టీడీపీ నేత, రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఇమ్దాదుల్లా పాల్గొన్నారు. రాష్ట్ర దూదేకుల, నూర్ బాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని పాత రాజేశ్వరి పేట, గొల్లపూడి, బొమ్మసాని, సుబ్బారావు నగర్ ప్రాంత వాసులకు చీరలు, లుంగీలు, దుప్పట్లు, టవళ్ల పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

జీవన్ చెరువు ఆక్రమణలపై సర్వే

పీలేరు, సెప్టెంబరు 22: పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు సమీపంలోని జీవన్ చెరువు, ఒడ్డు కుంట ఆక్రమణలపై ఆదివారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించారు. ప్రభుత్వ రికార్డుల మేరకు జీవన్ చెరువు సర్వే నెం.30లో 27.17 ఎకరాలు, ఒడ్డు కుంట 1.14 ఎకరాలు ఉండాల్సి ఉండగా గత ప్రభుత్వ హయాంలో అవి ఆక్రమణకు గురైనట్లు ఇటీవల ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు అధికారులు చెరువుల హద్దులు గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. తమ సర్వే వివరాలను నివేదిక రూపంలో తహసీల్దారు భీమేశ్వర రావుకు అందజేస్తామని ఇరిగేషన్ ఏఈ ఎతిరాజులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ హరికృష్ణ, వీఆర్వో ఎర్రయ్య, విలేజ్ సర్వేయర్ చంద్రశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


మదనపల్లెలో దత్త విజయానందస్వామిజీ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు22: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని దత్త విజయానంద స్వామిజీ పిలుపునిచ్చారు. శనివారం స్వామీజీ మదనపల్లెలోని బెంగళూరు రోడ్డులో భారతీ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో గణపతి హోమం నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. కళాశాల యాజమాన్యం కె. కృష్ణారెడ్డి, కె. శ్రీనివాసులురెడ్డిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దత్త విజయానంద స్వామీజీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆధ్యాత్మికంగా ముందుఉండాలన్నారు. ఉత్తమ విద్యార్థులుగా క్రమశిక్షణతో మెలగాలని స్వామీజీ విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కె వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లెలో నలుగురు సర్వేయర్లు బదిలీ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు22: మదనపల్లె మండలంలో పని చేస్తున్న నలుగురు సర్వేయర్లను బదిలీ చేస్తూ రాష్ట్రసర్వేయ సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న బీవీ సుబ్రహ్మణ్యంను అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటీలో డీఎస్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తిని పలమనేరు ఆర్డీవో కార్యాలయానికి, మదనపల్లె మున్సిపల్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న పూర్ణచంద్రను మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి, హెచ్ఎన్ఎస్ యూనిట్1 సర్వేయర్‌గా పని చేస్తున్న గోపినాథ్‌ను నిమ్మనపల్లె మండల సర్వేయర్‌గా బదిలీ చేశారు.

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసిన వారిని శిక్షించాలి


నిరసన చేస్తున్న ఏపీ వాల్మీకిసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22: తిరుమల లడ్డూప్రసాదంలో కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులిశ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వాల్మీకి సంఘం నేతలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూప్రసాదంలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులను శిక్షించాలని కోరారు. నాయకులు జయసంహా, మంజు నాథ్, శంకర, జగన్, రెడ్డిశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమార్కులపై కేసు నమోదు చేయండి

గుర్రంకొండ, సెప్టెంబరు 22:తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీసిన అక్రమార్కులపై కేసు నమోదు చేయాలంటూ బీజేపీ నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా బస్టాండు నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. లడ్డూకు వాడే నెయ్యిని కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఐ మధురామ చంద్రుడుకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రామాంజులు, సతీష్, దేవిక, రాము, భరత్, ఆదినారాయణ, అంజి, విజయ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

35 మందికి ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు


మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

పీలేరు, సెప్టెంబరు 22: కేవీపల్లె మండలం సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెలో ఆదివారం జరిగిన 'సంజీవని' గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్య శిబిరంలో 35 మందికి ఉచితంగా గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సాయంతో తిరుపతికి చెందిన మెడిగో హాస్పిటల్‌కు చెందిన నిష్ణాతులైన గైనకాలజీ, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులతో జరిగిన ఈ ఉచిత వైద్య, అవగాహన శిబిరంలో సొర కాయలపేట పంచాయతీకి చెందిన వివిధ గ్రామాలకు చెందిన 105 మంది మహిళలు పాల్గొన్నారు. వారందరికీ వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జిలానీ, డాక్టర్ షమీమ్, శ్రీనివాస ట్రస్టు సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, వలంటీర్లు షబ్బీర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


జయపాల్ (ఫైల్‌ఫోటో)

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22: మండలంలోని బసినికొండ వద్ద అనుమానాస్పద స్థితిలో జయపాల్ (27)అనే యువకుడు మృతి చెందాడు. తాలుకా పోలీసుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నిమ్మనపల్లె మండలం, ఆచార్లపల్లెకు చెందిన వెంకటేష్, సుజాత దంపతుల మొదటి సంతానం జయపాల్ వ్యవసాయ పనులు చేస్తూ జీవించేవాడు. శుక్రవారం తన తల్లి వద్ద నుంచి ఎరువుల కోసం పది వేలు తీసుకుని మదనపల్లెకు బయలుదేరిన జయపాల్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు శుక్రవారం, శనివారాల్లో బంధువులు ఊర్లలోను, పల్లె చుటుపక్కల వెతికినా ప్రయోజనం కనిపంచలేదు. తీరా ఆదివారం ఉదయం బసినికొండ బైపాస్ సమీపంలోని నవీన్‌బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తాలుకా ఎస్ఐ హరిహరప్రసాద్ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పంచనామా కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా బసినికొండ సమీపంలోని డాబాలో శుక్రవారం మధ్యాహ్నం మిత్రులతో భోజనాలు చేసి. మద్యం తాగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ద్విచక్రవాహనంలో మరొకరితో వెళుతున్నట్లు సీసీపుటేజ్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే మృతుడికి భార్య రాణి ఉంది. కాగా ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ములకలచెరువు, సెప్టెంబరు 22: మండలంలోని బురకాయలకోట వద్ద ద్విచక్రవాహనాన్ని వాహనం ఢీకొనడంతో తంబళ్లపల్లె మండలానికి చెందిన ఓ రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...తంబళ్లపల్లె మండలం బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ మొండిరాగిమానుపల్లెకు చెందిన దాదం శేషాద్రిరెడ్డి శనివారం టమోటాలు తీసుకుని ములకలచెరువు మార్కెట్‌కు వచ్చి అనంతరం అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి, పక్క గ్రామానికి చెందిన నాగరాజులు స్వగ్రామాలకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో వారు ములకలచెరువు మండలం బురకాయలకోట సమీపంలో ఎదురుగా వెళ్తున్న 407 వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడడంతో 108 వాహనంలో చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స నిమిత్తం డిశ్చార్జి అయ్యారు. ఈ నేపథ్యంలో తిరిగి శేషాద్రిరెడ్డిని ఆదివారం ఉదయం చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు.

లారీ ఢీకొని రైతులకు తీవ్రగాయాలు

కురబలకోట, సెప్టెంబరు 22: లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు రైతులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలో జరిగింది. మండలంలోని వనంరెడ్డిగారిపల్లెకు చెందిన మరమరెడ్డి(70), భాస్కరరెడ్డి(60)లు సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వచ్చి మదనపల్లె మండలం సీటీఎంకు వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా వారిలో మరమరెడ్డిని తిరుపతికి తరలించారు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు మందలించాడని తల్లి ఆత్మహత్యాయత్నం

రామసముద్రం, సెప్టెంబరు 22: కొడుకు మందలించాడని తల్లి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలోని నారిగానిపల్లె పంచాయతీ దిగువనమ్మోరుపల్లెకు చెందిన చౌడప్ప భార్య శంకరమ్మ తన కుమారుడు, కోడళ్లతో కలిసి ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. అయితే శంకరమ్మకు, కోడళ్లకు ఆదివారం చిన్న తగాదా రావడంతో కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయి వేరు కాపురం పెట్టుకోమన్నాడు. దీంతో ఆవేదన చెందిన శంకరమ్మ బతుకు భారమై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 22 : కర్ణాటక రాష్ట్రం నుంచి ఓ కారులో అక్రమంగా 40 కేసుల మద్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పీటీఎం పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చేలూరు నుంచి ఓకారులో అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా అవుతున్నట్లు సమాచారం అందుకున్న పీటీఎం ఎస్ఐ నరసింహుడు తమ సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ02 ఏజే.4959 నంబర్ కలిగిన కారులో ములకలచెరువు మండలం సోంపల్లె గ్రామపంచాయతీ అడవినాయనచెరువుపల్లెకు చెందిన మహేష్(40)ను అరెస్టు చేసి 40 కేసుల కర్ణాటక మద్యంతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం, కారు విలువ సుమారు. 1,53,600 ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 22: నిమ్మనపల్లె మండలం, దీట్టువారిపల్లెకు చెందిన ఎన్ మునిరత్న (58) ఆదివారం తెల్లవారుజామున పొలంవద్ద ఉన్న బోరుకు నీరు వదిలే క్రమంలో మోటర్‌వద్ద విద్యుత్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ - నలుగురికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, సెప్టెంబరు 22: ఎదురెదెరుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు...తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిగారిపల్లెకు చెందిన చంద్రశేఖర్, బాబయ్యలు తమ బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో పలకరించి వచ్చేందుకు ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరారు. అలాగే కురబలకోట మండలం తుంగవారిపల్లెకు చెందిన రైతులు ఎన్.లక్ష్మన్న, కె.లక్ష్మన్నలు పని నిమిత్తం శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి బయలేదేరారు. ఈ క్రమంలో రెండు ద్విచక్రవాహనాలు ములకలచెరువు మండలం పెద్దపాళ్యం రైల్వేగేటు వద్దకు వచ్చేసరికి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాల్లో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. నలుగురిని చికిత్సల నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యల్లమ్మ గుడిలో చోరీ

పెద్దమండ్యం, సెప్టెంబరు 22: పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ కొలికాడపల్లి సమీపంలో యల్లమ్మ గుడిలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పబడినట్లు గ్రామస్థులు తెలిపారు. గుడిలో సంవత్సరం క్రితం ఏర్పాటు చేసిన హుండీని ధ్వంసం చేసి అందులోని నగదు చోరీకి పాల్పడినట్లు వారు తెలిపారు. మండలంలో దొంగల బెడద ఎక్కువైందని ప్రజలు వాపోతున్నారు. పోలీసులు నిఘా పెంచి దొంగల బెడద నివారించాలని ప్రజలు కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

పీలేరు, సెప్టెంబరు 22: రోడ్డుకు అడ్డంగా వచ్చిన ఆవును తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఎం.విశ్వనాథ(38) ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. ఆదివారం ఉదయం పీలేరు నుంచి కేవీపల్లె మండలం వగళ్ల పంచాయతీ కొండ కిందపల్లెకు వెళుతున్న విశ్వనాథ దిచక్ర వాహనానికి కేవీపల్లె మండలం అంబువారిపల్లె వద్ద ఓ ఆవు రోడ్డుకు అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో విశ్వనాథ ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో అతను కింద పడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన ఆయనను స్థానికులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

దారి ఆక్రమణపై గ్రామస్థుల ఫిర్యాదు

పీలేరు, సెప్టెంబరు 22: దారి ఆక్రమణపై పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె గ్రామస్థులు ఆదివారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం.932/2లో ప్రభుత్వ భూమిగా ఉన్న గుట్టను కొంత మంది ఆదివారం ఉదయం పాక్షికంగా చదును చేయడమే కాకుండా గుట్టకు ఆనుకుని జగనన్న కాలనీకి వెళ్లే దారిని సైతం ఆక్రమించి దారిని మూసివేస్తూ కంచెను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దారిని మూసి వేయడమే కాకుండా విద్యుత్ స్తంభాలకు ఆనుకుని కంచెను ఏర్పాటు చేశారని, దీంతో భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు. ఈ విషయమై పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ గుట్ట, దారి ఆక్రమణ సమాచారం తెలిసిందని, సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

నిరంతర విద్యుత్‌కు చర్యలు చేపట్టాలి


మండలంలోని ముసలికుంట విద్యుత్ సబ్‌స్టేషన్

పెద్దమండ్యం, సెపెంబరు 22: పెద్దమండ్యం మండలానికి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం ముసలికుంట ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తీర్చడానికి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. దీంతో ముసలికుంట బండ్రేవు, దిగువపల్లి మండలవారిపల్లి ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తీరింది. ఈ సబ్‌స్టేషన్ ముసలికుంట ప్రాంతాన్నే కాకుండా మండలానికి కూడా నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రధాన కేంద్రంగా మారనుంది. పెద్దమండ్యం, కలిచెర్ల, తురకపల్లి సబ్‌స్టేషన్‌లతో పాటు ముసలికుంట సబ్‌స్టేషన్ నిర్మాణంతో సబ్‌స్టేషన్‌ల సంఖ్య నాలుగుకు చేరింది. కాగా కలికిరి నుంచి వచ్చే మెయిన్ సప్లై లైన్ గుర్రంకొండ మీదుగా పెద్దమండ్యం మండలానికి విద్యుత్ సరఫరా జరుగుతోంది. అలాగే ములకలచెరువు మండలం బురకాయలకోట నుంచి మెయిన్ సప్లై తంబళ్లపల్లి మీదుగా గోపిదిన్నె వరకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. కలికిరి, బురకాయలకోట విద్యుత్ సరఫరా మెయిన్ లైన్లులు పెద్దమండ్యం-తంబళ్లపల్లె సరిహద్దులో ఆగింది. ఈ ప్రాంతంలో రెండు విద్యుత్ మెయిన్ సప్లై లైన్లు కలిపే టెక్నికల్ పనులు పూర్తి చేస్తే మండలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు సాధ్యమవుతుందని గతంలో అధికారులు వెల్లడించారు. మండలంలో కలికిరి నుంచి విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినపుడు బురకాయలకోట నుంచి, బురకా యలకోట నుంచి విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు కలికిరి నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోందని తెలిపారు. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఈ కార్యాచరణకు రూపుదాలిస్తే కరువు మండలమైన పెద్దమండ్యంకు నిరంతరం విద్యుత్ సరఫరాతో భూములు సస్యశ్యామలమై ప్రజల జీవితాలలో వెలుగులు నిండుకుంటాయి. ట్రాన్స్‌కో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకొని నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేయా లని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన

బి.కొత్తకోట, సెప్టెంబరు 22: బి.కొత్తకోట పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్ వేదికగా మదనపల్లెకు చెందిన అగర్వాల్ కంటివైద్యశాల సిబ్బంది ఆదివారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వంచారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ వంశీధర్‌రెడ్డి రోగులను పరీక్షించి, అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. మిగిలిన వారికి తగిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

రామసముద్రం మండల పరిషత్ పాలనాధికారి మృతి

రామసముద్రం, సెప్టెంబరు 22: రామసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి.రమణ ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం గ్రౌండ్‌కి వాకింగ్ వెళ్లి ఇంటికి వచ్చిన ఆయనకు గుండెపోటు రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటీన ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందారు. ఇతనికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా భార్య, కుమారుడు గత కరోనాలో మృతి చెందారు. కుమార్తెకు వివాహం కాగా రమణ పుంగనూరులో ఓ అద్దె ఇంటి నుంచి రోజు రామసముద్రంకు వచ్చి వెళ్లే వారు. రమణ మృతి పట్ల మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, కృష్ణంరాజు, మాజీ జడ్పీటీసీ శివశంకర్, ఎంపీపీ కుసుమ కుమారి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, వైసీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌గౌడు, నందకిశోర్, మండల ప్రభుత్వ ఉద్యోగులు, స్నేహితులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు కురబలకోటకు మంత్రి నిమ్మల రాక

కురబలకోట, సెప్టెంబరు 22: రాష్ట్ర మంత్రి నిమ్మలనాయుడు సోమవారం కురబలకోట మండలంలో పర్యటించనున్నట్లు రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన అంగళ్ళులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 7.30గంటలకు హార్సిలీహిల్స్ నుంచి బయలుదేరి రోడ్డుమార్గాన మండలంలోని దొమ్మన్న బావి వద్దకు చేరుకుని హంద్రీ-నీవా బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలిస్తారన్నారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి మదనపల్లె చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించి అనంతరం రోడ్డు మార్గాన కప్పంకు చేరుకుంటారన్నారు. ఆయన పర్యటనకు టీడీపీ, జనసేన. బీజేపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.